ఈనాడు అనకాపల్లి

మంగళవారం 1 అక్టోబరు 2024

దృష్టి లోపం.. బాలలకు శాపం

పెరుగుతున్న సమస్య.. గుర్తించే పనిలో ప్రభుత్వం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

ఒకప్పుడు వయస్సు మీరిన వారికి వచ్చే కంటి సమస్యలు ఇప్పుడు చిన్నారులకు సైతం వస్తున్నాయి. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆగస్టు నుంచి కంటి పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని 134 పాఠశాలల్లో 22,862 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 1133 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. మరో ముగ్గురికి ఇతర కంటి లోపాలు ఉన్నాయి. చిన్న వయస్సులోనే దృష్టి లోపం ఉన్న వారు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

వైకాపా హయాంలో విద్యార్థుల్లో కంటి పరీక్షలు తూతూమంత్రంగా సాగాయి. గత ఏడాది సెప్టెంబరు 11 నుంచి 29 వరకు 92 పాఠశాలల్లో పరీక్షలు చేసి జగనన్న సురక్ష కార్యక్రమం రావడంతో వీటిని ఆపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పరీక్షలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మారుతున్న జీవనశైలిలో సెల్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లను ఎక్కువగా చూడడం చిన్నారులకు అలవాటుగా మారింది. చరవాణిని ఎక్కువగా చూడడం వల్ల ఈ సమస్యలు అధికమతున్నాయి. చిన్నప్పటి నుంచి వీటిని ఎక్కువగా వాడడం, గంటల తరబడి ఫోన్లు చూడడం వల్ల ఒత్తిడి పెరిగి వయస్సుతో సంబంధం లేకుండా ఈ సమస్యలు అధికమవుతున్నాయి. పుస్తకాలను దగ్గరగా పెట్టుకుని చదవడం వల్ల ఇబ్బందులు పెరిగిపోయాయి. పెరుగుతున్న కంటి సమస్యలను నివారించేలా తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మరింత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో కంటి అద్దాలతో వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో పోషకాహార లోపం వల్ల చిన్నారుల్లో కంటి సమస్యలు వచ్చేవి. ఇప్పుడు బాగా తగ్గాయని కంటి వైద్యులు చెబుతున్నారు.



కంటి అద్దాలు అవసరమైన విద్యార్థులకు పరీక్ష

కంటిపై ఒత్తిడిని తగ్గించుకోవాలి



చిన్నారుల్లో కంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఆగస్టు 2 నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటికి కంటి సమస్యలు ఉన్న 1133 మంది విద్యార్థులకు గుర్తించాం. అక్టోబరు నెలాఖరుకల్లా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి చేస్తాం. విద్యార్థుల్లో కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం.

– డాక్టర్ జీవీ రమణకుమార్, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్, అనకాపల్లి

రూ.21 వేలు పలికిన గణపతి లడ్డూ



చీడికాడ, న్యూస్‌టుడే: బిబ్బపాలెంలో వరసిద్ధి వినాయక మండపంలో సోమవారం నిర్వహించిన వేలంలో గణపతి లడ్డూ ప్రసాదం రూ.21 వేలు పలికింది. 151 కేజీల లడ్డూను గ్రామానికి చెందిన వరహాలనాయుడు దక్కించుకున్నారు. మండపం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు లడ్డూను అందజేశారు.

లడ్డూ దక్కించుకున్న భక్తుడు

ఖాతాలో 49 కోట్లు.. వాడుకోడానికి పాట్లు!

★ ఉమ్మడి జిల్లా ఖనిజాభివృద్ధి నిధుల తీరిది..
★ అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు దక్కని వాటా

పోస్టింగ్ ఒకరు.. విధుల్లో మరొకరు

ఈనాడు, అనకాపల్లి

గనుల శాఖ ఖాతాల్లో జిల్లా ఖనిజాభివృద్ధి నిధులు (డీఎంఎఫ్) కనిపిస్తున్నా ఖర్చు చేయడానికి అవకాశం లేకుండాపోయింది. వైకాపా ప్రభుత్వ అనాలోచిత చర్యల కారణంగా రూ.కోట్ల సొమ్ములు ఖాతాల్లోనే మగ్గుతున్నాయి. జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి జిల్లా ఖాతాలో రూ.49 కోట్ల డీఎంఎఫ్ నిధులున్నాయి. వీటిని విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు సమానంగా పంచాల్సి ఉన్నా నాటి సర్కారు నిర్వాకంతో వీలుకాలేదు.



గత పాలకులు గనుల శాఖలో ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారు. ఉత్తర్వుల్లో పోస్టింగ్ ఒకచోట.. విధులు నిర్వహించేది మరోచోట కావడంతో ఈ నిధులు ఉమ్మడి ఖాతా దాటలేకపోయాయి. కూటమి ప్రభుత్వంలో బదిలీలు పూర్తయ్యాయి. కొత్త అధికారులైనా ఈ నిధుల పంపకాలకు చర్యలు తీసుకుంటే వాటితో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పట్టాలెక్కడానికి అవకాశం ఉంటుంది.

గనులు, క్వారీ లీజుదారులు సీనరేజీ ఛార్జీల్లో 30 శాతం డీఎంఎఫ్‌గా చెల్లించాల్సి ఉంటుంది. ఇలా 2019 నుంచి 2022 జూన్ వరకు సుమారు రూ.55.69 కోట్లు ఉమ్మడి జిల్లాకు అందుబాటులోకి వచ్చాయి. కొవిడ్‌లో ఖర్చుల కోసమని రూ.6.69 కోట్లు మళ్లించారు. మిగతా రూ.49 కోట్లను మూడు జిల్లాలకు రూ.16 కోట్ల చొప్పున పంపకాలు చేయాల్సి ఉంది. 2022 జూన్ తర్వాత ఏ జిల్లా పరిధిలో ఉన్న గనుల నుంచి వచ్చే డీఎంఎఫ్ ఆ జిల్లా ఖాతాలోనే జమ అవుతున్నాయి. ఉమ్మడి జిల్లా ఖాతాలో రెండేళ్లుగా మగ్గుతున్న నిధుల పంపకానికి మాత్రం మోక్షం లేకుండా పోయింది. ఈ నిధులతో గతంలో ప్రతిపాదించిన పనులు కొన్ని అసంపూర్తిగా నిలిచిపోగా చాలావరకు ప్రారంభమే కాలేదు.



విశాఖ జిల్లా గనుల శాఖ ఉప సంచాలకులుగా [illegible] రెండేళ్ల క్రితం నియమించగా ఆయన ప్రధాన కార్యాలయంలోనే ఉండిపోయారు. డీఈవీఎస్ఎన్ రాజు, వెంకట కృష్ణ ఇన్‌ఛార్జులుగా పనిచేశారు. వీరు పర్యవేక్షణకే తప్ప జీతభత్యాలు, ఇతర బిల్లుల ఆమోదం అంతా విజయవాడ నుంచి వెంకటేశ్వర్లే చూసుకునేవారు. డీఎంఎఫ్ సొమ్ములు కూడా ఆయనే అనకాపల్లి, అల్లూరి జిల్లాల ఖాతాలకు సర్దుబాటు చేయాలి. అలా జరగాలంటే అప్పటి డీఎంఎఫ్ [illegible] వెంకటేశ్వర్లు బయోమెట్రిక్ వేయాలి. [illegible] బయోమెట్రిక్ వేయాల్సి ఉండడంతో పంపకాలు పట్టించుకోలేదు.



వైకాపా హయాంలో కశింకోట వద్ద డీఎంఎఫ్ నిధులతో వంతెన నిర్మాణానికి వేసిన శిలాఫలకం..

ప్రభావిత గ్రామాలపై ఖర్చు చేయాలి..

గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10 నుంచి 25 కి.మీ పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించాలి. 2014-19 మధ్యలో ఈ నిధులను జిల్లా అధికారులు బాగానే వినియోగించుకున్నారు. వైకాపా హయాంలోనే ఈ సొమ్మును వినియోగించుకోలేకపోయారు. ఈ విషయమై గనుల శాఖ పూర్వ ఉప సంచాలకులు, పాడేరు జిల్లా మైనింగ్ అధికారి డీఈవీఎస్ఎన్ రాజు వద్ద ప్రస్తావించగా 'బదిలీపై విశాఖ జిల్లాకు వచ్చే కొత్త అధికారి చొరవ తీసుకుంటే మూడు జిల్లాలకు సమానంగా సొమ్ములు పంచడానికి వీలవుతుంది. త్వరలోనే ఈ పంపకాలు జరుగుతాయని ఆశిస్తున్నాం' అని వివరించారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో అక్టోబర్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి పేర్కొన్నారు. మంగళవారం 100 శాతం పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఉదయం ఆరు గంటల నుంచే పింఛను సొమ్ము లబ్ధిదారులకు అందిస్తారన్నారు. 24 మండలాల్లో అనకాపల్లి జీవీఎంసీ, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల పరిధిలో 14 రకాల 2,60,816 మంది పింఛను దారులు ఉన్నారన్నారు. వీరికి రూ. 107.72 కోట్ల మేర పంపిణీ చేస్తామన్నారు. పింఛను పంపిణీ సమయంలో లబ్ధిదారులు ఇంటి వద్ద అందుబాటులో ఉండాలన్నారు. తొలి రోజు అందని వారికి రెండో రోజు ఇస్తామని చెప్పారు.

ఆపద్బాంధవులు

● రక్తదానంతో ప్రాణాలు నిలుపుతున్న దాతలు
● నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే



అనకాపల్లి ఆసుపత్రిలో ప్రసవ సమయంలో గర్భిణికి రక్తం అవసరమైంది. 'ఓ-' గ్రూపు అవసరం కావడంతో అనకాపల్లికి చెందిన ఒకరు వచ్చి రక్తదానం చేశారు. సకాలంలో అందించిన రక్తంతో తల్లీబిడ్డ ప్రాణాలను కాపాడగలిగారు.

చోడవరానికి వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకు రక్తం అవసరం కావడంతో స్నేహితులు ముందుకు వచ్చి ప్రాణాలు నిలిపారు.

..ఇలా ఎంతో మంది అత్యవసర సమయంలో రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలుపుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో నెలకు 150 మంది నుంచి 200 మంది వరకు రక్తదానం చేస్తున్నారు. గతంలో కంటే ఇప్పుడు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. మనం ఇచ్చే రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందన్న ప్రచారం పలువురిని ముందుకు వచ్చేలా చేస్తోంది. ప్రతి ఆరునెలలకు ఒకసారి రక్తం ఇచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. అత్యవసర సమయంలో దాతలు ఎక్కడి నుంచైనా ఆసుపత్రికి వచ్చి రక్తదానం చేస్తూ ప్రాణాలను కాపాడుతున్నారు. మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలో ఏడాదికి ఒకసారి శిబిరాలను ఏర్పాటు చేసి విద్యార్థులు రక్తదానం చేస్తున్నారు.



అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో రక్తదాతలు

అనకాపల్లి ఆసుపత్రిలో రక్తదాతల వివరాలు

నెల	రక్తదానం చేసిన వారు
జనవరి	155
ఫిబ్రవరి	143
మార్చి	149
ఏప్రిల్	102
మే	113
జూన్	142
జులై	104
ఆగస్టు	89

పెరుగుతున్న అవసరాలు

కరోనా అనంతరం రక్తం అవసరం పెరుగుతోంది. ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు అధికమయ్యాయి. అలాగే గర్భిణుల్లో రక్తహీనత కేసులు ఎక్కువయ్యాయి. రోడ్డు ప్రమాదాలూ పెచ్చుమీరుతున్న నేపథ్యంలో క్షతగాత్రుల చికిత్సలో రక్తం అవసరం ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం సమకూర్చడానికి దాతలు సకాలంలో స్పందిస్తూ తమవంతు సహకారాన్ని అందిస్తున్నారు.



రక్తదాతలను అభినందిస్తూ

స్వచ్ఛంద రక్తదాతలు పెరిగారు



స్వచ్ఛందంగా ఆసుపత్రికి వచ్చి రక్తం ఇచ్చే దాతల సంఖ్య పెరిగింది. దీనివల్ల ఆసుపత్రిలో రోగుల అవసరాలకు తగ్గట్టు రక్తాన్ని అందించగలుగుతున్నాం. పుట్టిన రోజు వేడుకలు, శుభకార్యక్రమాల సమయంలో రక్తదానానికి యువత ముందుకు వస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేసే వారూ ఉన్నారు.

– డాక్టర్ కనకదుర్గ, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి, అనకాపల్లి

ఏ సమయంలోనైనా సిద్ధం



రక్తం అత్యవసరమైతే ఏ సమయంలోనైనా రక్తదానం చేయడం నాకు అలవాటుగా మారింది. మా సోదరి ప్రసవ సమయంలో రక్తం అవసరమైతే లైవ్‌లో రక్తం అందించాను. అప్పటి నుంచి ఎవరికి అత్యవసరమైనా రక్తదానం చేస్తున్నాను. ఇది నాకు ఎంతో తృప్తిని ఇస్తుంది. ఇప్పటికి 20 సార్లు రక్తదానం చేశాను.

– కాండ్రేగుల శ్రీహరి, హరిపాలెం, అచ్యుతాపురం మండలం

ఆపద సమయంలో అందుబాటులో..



డిగ్రీ చదువుతున్నప్పటి నుంచి రక్తదానం చేస్తున్నాను. ఇప్పటికి 30 సార్లు రక్తదానం చేశాను. మనం ఇచ్చే రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుంది. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా చేస్తున్నా.

– బీపీ ఫణేంద్రకుమార్, అనకాపల్లి

ఇసుక అక్రమ నిల్వల వేలం

నక్కపల్లి, న్యూస్‌టుడే: అమలాపురం శివారు మూలపర్ర వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని, వేలం నిర్వహించినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై సన్నిబాబు పరిశీలనకు వెళ్లగా అక్కడ భారీగా నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించారు. దీనిపై తహసీల్దార్ అంబేడ్కర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న రెవెన్యూ సిబ్బంది నిల్వలను పరిశీలించారు. సోమవారం గ్రామస్థుల సమక్షంలో పట్టుబడిన ఇసుకను వేలం వేశారు. సుమారు వంద టన్నులకు రూ. 1,03,000 వచ్చింది.



ఇసుక వేలం వేస్తున్న అధికారులు



పట్టుబడిన దుండగుడు

త్రిమూర్తులు ఆలయంలో చోరీ యత్నం

మునగపాక, న్యూస్‌టుడే: తోటాడ త్రిమూర్తులు ఆలయంలో సోమవారం సాయంత్రం అపరిచిత వ్యక్తి ప్రవేశించి హుండీ పగులకొట్టి నగదు అపహరిస్తుండగా అర్చకులు, స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇతని వయసు 55 సంవత్సరాలు ఉంటుందని, హిందీ మాట్లాడుతున్నాడని స్థానికులు తెలిపారు.

హద్దు రాయి.. ప్రమాదాలోయ్!

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జగనన్న సమగ్ర భూసర్వేలో భాగంగా వేసిన సర్వేరాయి భూములను రక్షించకపోగా ఈ రహదారిలో ప్రమాదకరంగా మారింది. అసలే ఈ రోడ్డు ఇరుగ్గా ఉంది. అయితే మలుపులో అడుగు ఎత్తు వరకు రోడ్డును ఆనుకొని సర్వేరాయిని అధికారులు పాతించారు. దీంతో రాత్రి సమయంలో ఇది కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. సాగుభూముల్లో వేయాల్సిన సర్వే రాళ్ల గ్రామంలో రోడ్డు పక్కన ఇళ్లకు సరిహద్దుగా వేయడంపై ప్రయాణికులు విస్తుపోతున్నారు. ఈ రోడ్డులో వేసిన రాళ్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు



ఉప్పవరం వద్ద రోడ్డు మలుపులో ప్రమాదకరంగా సర్వేరాయి

మున్సిపల్ ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష 2న

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై అక్టోబర్ 2న సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు యూటీఎఫ్ అధ్యక్షురాలు వి. శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి గొంది చినబ్బాయి విద్యా సహాయ సంచాలకులు రమాజ్యోతికి వినతిపత్రం అందించారు. అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలిలో బుధవారం ఒకరోజు సత్యాగ్రహ దీక్ష చేస్తున్నామన్నారు. రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మున్సిపల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం పోస్టులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు. పాఠశాలలో తగినంత మంది సబ్జెక్టు ఉపాధ్యాయులను, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. దశాబ్దాలుగా మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టలేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నాయకులు రాజునాయుడు, భాషా, జోగా రాజేష్, దేముడు పాల్గొన్నారు.



ఏడీ రమాజ్యోతికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వైద్య సేవలపై ఫిర్యాదులొస్తే సహించం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై మలేరియా జోనల్ అధికారిణి ఎం.శాంతి ప్రభ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని సూచించారు. మునగపాక కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు. డెంగీ కేసులు నమోదవుతున్నా సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయన్నారు. రక్తపరీక్షలు చేస్తున్నా సకాలంలో రోగులకు రిపోర్టులు ఇవ్వకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైద్యాధికారిణి విమలగిరి, సీహెచ్ఓ ఆర్.దేవకాంత, అనకాపల్లి సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారిణి శాంతిప్రభ

కుస్తీలో కశింకోట విద్యార్థులకు పతకాలు

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కుస్తీపోటీలకు కశింకోట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరు ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-17 గ్రీకో రోమన్ విభాగంలో పాఠశాలకు చెందిన బి.రోహిత్, కె.అఖిల్ స్వర్ణ, జె.రాంచరణ్, సయ్యద్ అబ్దుల్ అజీజ్‌షా ఖాదరీ రజత పతకాలు సాధించారు. ప్రథమస్థానంలో నిలిచిన ఇద్దరు విద్యార్థులు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కుస్తీపోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు వేదుల ప్రభాకర్ తెలిపారు. ఈ విద్యార్థులను హెచ్‌ఎం ఆచంట రవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి అభినందించారు.



కుస్తీ పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించిన విద్యార్థులు

అండర్-17 వాలీబాల్ పోటీలు నేడు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పెదగుమ్ములూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల తెలిపారు. అండర్-17 విభాగంలో బాలబాలికలకు రాష్ట్రస్థాయికి ఎంపికకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడ్డురోడ్డు నుంచి పాఠశాల వరకు విద్యార్థుల కోసం బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

క్రీడాలోకం

లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించండి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులను ఎల్లప్పుడు గౌరవించి, క్రమశిక్షణతో ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా స్వర్ణాంధ్ర-2047 అంశంపై కళాశాలలు, పాఠశాలలు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థులకు కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ప్రశంసాపత్రం, షీల్డ్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం లక్ష్యసాధనకు శ్రమించాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. సీపీఓ రామారావు, పాఠశాల, కళాశాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం, షీల్డు అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలు రేపటి నుంచి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సీబీఎస్ఈ క్లస్టర్-7 ఆటల పోటీలు పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఆవరణలో నిర్వహించనున్నామని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. బుధవారం నుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో బాలికలు పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.

అర్జీల పరిష్కారంపై శ్రద్ధ చూపండి: కలెక్టర్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అధికారులు అర్జీలపై శ్రద్ధ చూపాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు అర్జీదారులు తరలివచ్చారు. 316 అర్జీలు రాగా.. ఆయా శాఖల అధికారులకు పంపారు. కలెక్టర్‌తోపాటు జేసీ జాహ్నవి, డీఆర్వో స్వీకరించారు.

❖ నక్కపల్లి మండలం పెదదొడ్డిగల్లు పంచాయతీకి సీతపాలెం చెందిన 12 మంది ఎన్ఆర్ఈజీ, ఇందిరమ్మ పథకాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి బిల్లులు చెల్లించలేదు. ప్రభుత్వం చొరవ చూపి బిల్లులు చెల్లించాలని పెదదొడ్డిగల్లుకు చెందిన అప్పలరాజు కోరారు.

❖ దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మానసిక వైకల్యంతో బాధపడుతున్నట్లు నక్కపల్లికి చెందిన శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

❖ అనకాపల్లి సంపత్‌పురం-కొండం వరకు ఉన్న పీఎంఆర్‌డీవై లేఅవుట్లలో 8 వేలకు పైగా సిమెంట్ బస్తాలు, ఇటుకలు, టన్నుల కొద్దీ ఇనుమును అక్రమంగా అమ్మకాలు చేపట్టారని గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు.

❖ మాడుగుల మండలం గాదిరాయిలో 1.42 సెంట్ల జిరాయితీ స్థలం కొద్ది పరిధిలో ఉన్నా ఇటీవల జరిగిన రీ సర్వేలో వేరొకరి పేరున మార్చేసి ఆన్‌లైన్ చేశారని పరవాడ మండలం మోటూరువానిపాలెంకు చెందిన ఊడి రాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, డీఆర్వో దయానిధి

ఈవీఎం స్ట్రాంగ్ రూం తనిఖీ

[illegible] కార్యాలయం ఆవరణలోని ఈవీఎం స్ట్రాంగ్ రూం గోదామును కలెక్టర్ విజయకృష్ణన్ తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తనిఖీలు చేపట్టారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు, సీసీ ఫుటేజీలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఆర్వో చిన్నికృష్ణ, జిల్లా అగ్నిమాపక అధికారి వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, ఉప తహసీల్దార్ రవిబాబు పాల్గొన్నారు.

❖ దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటి ముత్యం సుబ్బయ్య వినతిపత్రం అందజేశారు.

❖ కశింకోట: తాళ్లపాలెం సర్వే నంబర్ 123-14లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై గ్రామానికి చెందిన కరణం వెంకటరమణ ఫిర్యాదు చేశారు. సర్వే నంబరులో నర్సీపట్నం రహదారిని ఆనుకొని ఉన్న 45 సెంట్ల ప్రభుత్వ స్థలంలో 20 సెంట్ల భూమిని ఆక్రమించి 2023లో నిర్మాణం చేపట్టారన్నారు. గ్రామస్థుల ఫిర్యాదుతో అప్పటి తహసీల్దారు నిర్మాణాలను నిలిపివేయించినా.. మళ్లీ ప్రారంభించారని, సుమారు రూ.రెండు కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.


కలెక్టరేట్ ఎదుట మహిళల ధర్నా

అనకాపల్లి మండలం అచ్చియ్యపేట జగనన్న లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని లబ్ధిదారులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ 200 ఇళ్ల నిర్మాణం పూర్తయినా మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నామన్నారు. తాగునీరు, వీధిలైట్లు, రహదారులు లేవన్నారు. పలుమార్లు సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోలేదన్నారు.

తనఖా పెడితే ఇంటిని అమ్మేశారు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుడి ఫిర్యాదు


అండిబోయిన రమేశ్, నాగమణి

అనకాపల్లి పట్టణం న్యూస్‌టుడే: 'నాకు, మా సోదరికి కళ్లు కనిపించవు. అమ్మతో కలిసి ఉంటున్నాం. అనకాపల్లిలోని మా ఇంటిని 2013లో రూ.3 లక్షలకు తనఖా పెట్టాం. ఇంటిని విక్రయిస్తున్నట్లుగా తాము సంతకాలు చేశామని అప్పిచ్చిన వ్యక్తి చెబుతున్నారు. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పంపారు. అప్పు కింద తీసుకున్న వ్యక్తికి 15 రోజుల్లోగా రూ.15 లక్షలు ఇవ్వాలని చెప్పారు. ఇంటికి అద్దె, వడ్డీ లేకుండా తనఖా పెడితే ఇంత మొత్తం ఎలా అయ్యిందో అర్థం కావడం లేదు. దీనిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయా'లని కోరుతూ బాధితులు అండిబోయిన రమేశ్, నాగమణి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు చట్టపరిధిలో పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 40 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఏఎస్పీలు నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, మోసం కేసులు అధికంగా వచ్చాయి.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి



మాకు పొట్టిదొరపాలెంలో రోడ్డుకు అనుకుని 7 సెంట్ల స్థలం ఉంది. వైకాపా హయాంలో మా భూమిని వేరే వ్యక్తి పేరు మీదకు మార్చారు. దీనిపై ఫిర్యాదుచేస్తే అధికారులు మా స్థలాన్ని వేరే వ్యక్తి పేరున మార్చారని నిర్ధారణ అయ్యింది. దీనికి బాధ్యులైన రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసు పెట్టాలి.

– కొసిరెడ్డి మహదేముడు, పొట్టిదొరపాలెం, బుచ్చెయ్యపేట మండలం

ఎక్సైజ్ ఎస్సైల బదిలీ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లకు ఎస్సైలను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనకాపల్లి ఎక్సైజ్ ఎస్సైగా కె.ఎస్ గణేష్, ఐఎంఎల్ డిపో- ఎస్.నమ్రత, ఈఎస్ టాస్క్‌ఫోర్స్- ఎస్.చంద్రశేఖర్, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్- వీవీ గిరిబాబు, బీసీ హెచ్ వీర్రాజు నియామకమయ్యారు. అదేవిధంగా చోడవరం- కె.హనుమంతు, ఎం.శేఖరం, మాడుగుల- ఎం.శ్రీనివాసరెడ్డి, వీజే శంకర్‌కుమార్, నర్సీపట్నం- వై.కిరణ్‌కుమార్, ఎలమంచిలి- కె.శ్రావణి, ఎం.సోమయ్య, పాయకరావుపేట- ఎం.అచ్యుతరావు, సబ్బవరం- వీవీ రమణలను నియమించారు.

బాలికపై అత్యాచార యత్నం కేసులో ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచార యత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల కారాగార శిక్షతోపాటు రూ.17వేల జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పునిచ్చారు. జరిమానా మొత్తాన్ని బాధితురాలికి పరిహారంగా అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా మునగపాక మండలం, వెంకన్నపాలెం శివారు ప్రాంతానికి చెందిన బండారు రమణ లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. అతనుంటున్న ప్రాంతంలో ఓ బాలిక(8) కుటుంబ నివశించేది. 2019 ఫిబ్రవరి 10న మధ్యాహ్నం బాలిక తండ్రి ఇంటికి వచ్చాడు. కుమార్తె కనిపించకపోవడంతో గట్టిగా పిలిచాడు. సమీప ఇంట్లోంచి కుమార్తె ఏడుస్తూ రావడం గమనించి ఏం జరిగిందని ప్రశ్నించాడు. సెల్‌ఫోన్‌లో పలు అసభ్యకర దృశ్యాలు చూపించాడని, తర్వాత అత్యాచారం చేయబోగా ఏడవడంతో విడిచి పెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు బాధితురాలి తల్లిదండ్రులు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

రైతేరాజు

పెరిగిన రంగు బెల్లం ధరలు

న్యూస్‌టుడే, అనకాపల్లి

అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు బెల్లం ధరలు పెరిగాయి. మధ్య, నాసి రకాల ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.685 పెరగ్గా, నాసి రకాలకు రూ.290, మధ్య రకాలకు రూ.110 తగ్గింది.

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,280	4,965
మధ్య	3,860	3,750
నాసి	3,540	3,250



ముంపులో చెరకు.. యాజమాన్య పద్ధతులు

అనకాపల్లి, న్యూస్‌టుడే కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు, ఆవ ప్రాంతాల్లోని చెరకు తోటలు ముంపునకు గురవుతున్నాయి. సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుంది. ముంపు బారిన పడిన తోటల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అనకాపల్లి పరిశోధన కేంద్రం చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి సూచిస్తున్నారు.




● తోట నాటేందుకు ముందే ఊట కాలువలు తీసుకోవాలి. ముంపు ప్రాంతాల్లో ఎర్రకుళ్లు తెగులును తట్టుకునే కో6907, 85ఏ261, కోటి 8201, కో7217, కోప 7602, 98ఏ163, 2003వి46, 2000ఏ225, 2003ఏ255 రకాలను విత్తనంగా ఎంచుకోవాలి. పొలం గట్లను బలోపేతం వేసుకోవాలి.

● ముంపునకు గురైన తోటలకు తెల్లనల్లి సోకే ఆస్కారముంది. నివారణకు క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి 2.5 మి.లీ. కలిపి ఆకు అడుగు భాగం తడిచేలా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

● తోటలో చేరిన నీటిని మోటార్ల ద్వారా బయటకు తోడేయాలి. సిఫార్సు చేసిన నత్రజని 30, 60 రోజుల్లో వేయాలి. నీరు తొలగించాక ఎకరాకు 50 కేజీల యూరియా, 50 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను మొక్క వేర్ల వద్ద తవ్వి వేసి మట్టితో కప్పాలి.

● నీరు తొలగించలేని పరిస్థితులు ఉంటే లీటరు నీటిలో 25 గ్రాముల యూరియా, 25 గ్రాముల ఎంఓపీ కలిపిన ద్రావణాన్ని ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి.



ఆహ్లాదం.. ఆరోగ్యం.. ఆదాయం

న్యూస్‌టుడే, చింతపల్లి

వలిసెల సాగుతో బహుళ ప్రయోజనాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా పేరు చెబితే పచ్చని కొండలు, వాటి నడుమ పసుపు తివాచీ పరిచినట్లుండే వలిసె పూల తోటలే గుర్తుకొస్తాయి. గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించే సంప్రదాయ వలిసెల సాగు బహుళ ప్రయోజనకారిగా మారింది. ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం, ఆదాయాన్నిచ్చే పంటగా పేరొందింది. వేరుశెనగ తర్వాత గిరిజనులు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసే నూనె గింజల పంట ఇదే.

రాష్ట్ర వ్యాప్తంగా వలిసెల సాగు 46,312 ఎకరాల్లో సాగవుతుండగా.. ఒక్క అల్లూరి జిల్లాలోనే సుమారు 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటగా పండిస్తున్నారు. ఏటికేడు సాగు విస్తీర్ణం పెరగాల్సింది పోయి తగ్గుతూ వస్తోంది. ఇందుకు ప్రకృతి వైపరీత్యాలు కొంత కారణం కాగా, నూనె తీసే యంత్రాలు, మిల్లులు మన్యంలో తగినన్ని లేకపోవడం, సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేక గిట్టుబాటు ధరలు రాకపోవడంతో సాగు తగ్గుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

ప్రత్యేకంగా ప్రాజెక్టు అమలు..: వలిసెల సాగు విస్తీర్ణం పెంచేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు చింతపల్లి కేంద్రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రత్యేకంగా ఓ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. సుమారు మూడు వేల రకాల వలిసెల విత్తనాలపై ఇక్కడ ప్రయోగాలు జరుగుతున్నాయి. హరిపురంలోని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సాగు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. మన్యం వాతావరణానికి అనుకూలమైన రకాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.



విత్తే సమయం: ఆగస్టు రెండో పక్షం నుంచి సెప్టెంబరు రెండో పక్షం వరకు విత్తవచ్చు. ఆలస్యమైతే పూత, గింజకట్టు దశలో పైరు వర్షాభావానికి గురై దిగుబడులపై ప్రభావం పడుతుందని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సేద్యపు విభాగం శాస్త్రవేత్త **డాక్టర్ వానప్రసాదరావు** చెబుతున్నారు.

రకాలు : కేజీఎన్-2, ఉత్కల్‌నైజర్, డీఎన్ఎస్-4, జేఎన్ఎస్-28, జేఎన్ఎస్-30 అనుకూలం.

నేలలు: తేలికపాటి గరుకు నేలలు, కొండవాలు, పోడు నేలలు, తేమ నిల్వ ఉంచుకుని నీరు పోయే అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు.

దిగుబడి : ఎకరాకు 160 కేజీల దిగుబడి వస్తుంది. గింజలో నూనె శాతం 45-50 శాతం వస్తుంది. నూనెను వంటల్లోనే కాకుండా సబ్బులు, వార్నీషులు, కాస్మోటిక్స్ తయారీ పరిశ్రమల్లో వినియోగిస్తారు. నూనెను తీయగా మిగిలిన పిండిని పశువుల దాణాగానూ వినియోగించవచ్చు.

బంగారు తీగతో ముప్పు..: ఈ పంటను ఆకాశ పందిరి అనే కలుపు తీగ ఆశించి నష్టపరుస్తోంది. దీన్నే బంగారు తీగ అని పిలుస్తారు. నివారణకు ఉప్పునీటి ద్రావణం పద్ధతిని ఆచరించాలి. ఎకరాకు సరిపడా 2-3 కేజీల వలిసెల విత్తనాలను 20 లీటర్ల నీటిలో 3 కేజీల ఉప్పు వేసి కలియబెట్టాలి. ఈ ద్రావణంలో వలిసెల విత్తనాలను వేసి కలిపితే ఆకాశ పందిరి విత్తనాలు నీటి అడుగుకు చేరతాయి పైకి తేలిన వలిసెల విత్తనాలను వేరు చేసి మంచినీటితో కడిగి ఆరబెట్టి వెంటనే పొలంలో చల్లుకుంటే కలుపు తీగను నివారించవచ్చు.

ఎరువులు: చివరి దుక్కిలో ఎకరాకు 2.5 టన్నుల పశువుల ఎరువు వేయాలి. విత్తిన 15-20 రోజుల వ్యవధిలో నత్రజని వేసుకుంటే దిగుబడులు పెరుగుతాయి. చీడపీడల బెడద చాలా తక్కువ. 100 నుంచి 110 రోజుల్లో పంటకోతకొస్తుంది. మొక్కలను నేలకంటూ కోసి ఎండలో ఆరబెట్టాలి. కట్టెలతో కొట్టి గింజలను వేరుచేయాలి. తర్వాత గింజలను పది రోజుల వరకు ఎండలో ఆరబెట్టి బస్తాల్లో నిల్వచేసి మార్కెట్‌కు తరలించవచ్చు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సలహా

మొక్కజొన్నలో తెగుళ్లు.. నివారణ చర్యలు

? రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేశా. ఇటీవల కురిసిన వర్షాలకు తోటలో నీరు చేరింది. తెగుళ్లు ఆశించాయి. దిగుబడులపై ప్రభావం పడుతుందా. –కిలో అర్జున్ చౌడుపల్లి

✔: పొలంలో అదనంగా ఉన్న నీటిని పూర్తిగా తొలగించాలి. తేమ లేకుండా అంతర సాగు చేయాలి. మొక్క మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలి. తెగులు ఆశించిన మొక్కలను తొలగించాలి. కత్తెర పురుగు ఆశిస్తే నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును లీటరు నీటిలో కలిపి తెగులు ఆశించిన మొక్క మొవ్వు భాగం తడిచేలా పిచికారీ చేయాలి.

? నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ప్రస్తుతం శాఖీయ దశలో ఉంది. పంట కొనలు రంగుమారుతున్నాయి.

– రామారావు, గొందిపాకలు

✔: వర్షాలు తగ్గాక వాతావరణంలో మార్పుల వల్ల ప్రస్తుతం వరి పంటను కాండం తొలుచుపురుగు, గొంగళి పురుగులు, అగ్గితెగులు ఆశించే ఆస్కారముంది. అధిక తేమ వల్ల కొన్ని రకాల తెగుళ్లు సోకవచ్చు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచనలు పాటించాలి.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం **ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి** సమాధానాలు ఇచ్చారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో సందేహాలా ఫోను చేయండి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త **దాడి ఉమామహేశ్వరరావు** సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉ: 9 నుంచి - సాయంత్రం 5 గంటల మధ్య 94410 75852 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

తెదేపా నాయకులను బ్రోకర్లంటారా?

వైకాపా నాయకుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

కోటవురట్ల, న్యూస్‌టుడే: తెదేపా నాయకులను బ్రోకర్లుగా పేర్కొంటూ వైకాపాకు చెందిన సర్పంచి మాట్లాడటం మండల పరిషత్తు సమావేశంలో ఉద్రిక్తతకు దారితీసింది. ఎంపీపీ అప్పలనాయుడు అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. సమావేశానికి అన్ని శాఖల అధికారులు రాలేదని, గత సమావేశాలకూ చాలామంది అధికారులు హాజరు కాలేదని సర్పంచులు శివరాం, జగదీష్ ప్రస్తావించారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు చెప్పారు. ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు ఇష్టానుసారంగా రోడ్లు తవ్వేస్తుండటంతో, సీసీ రోడ్లు అధ్వానంగా తయారవడంతో రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని బి.కె.పల్లి ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, సర్పంచి అప్పారావు పేర్కొన్నారు. పనులు త్వరగా పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గీతాంజలిని కోరారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకొస్తే, ట్రాక్టర్లపై, ఎడ్ల బళ్లపై ఇసుక తీసుకెళ్లేవారిని పట్టుకోవడం సరైనదా అంటూ చౌడువాడ సర్పంచి గోపాలకృష్ణ అధికారులను ప్రశ్నించారు.


వాగ్వాదానికి దిగిన తెదేపా, వైకాపా ప్రజాప్రతినిధులు

పందూరు సర్పంచి వ్యాఖ్యలతో దుమారం

గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకొని, బిల్లులు మంజూరు కాని లబ్ధిదారులను గ్రామాల్లోకి వెళ్లి గుర్తిస్తున్నామని గృహనిర్మాణ సంస్థ ఏఈ వరప్రసాద్ చెబుతుండగా... 'తెదేపా బ్రోకర్లను వెంట పెట్టుకొని, వారు చెప్పినట్లు చేస్తున్నారా?' అంటూ పందూరు వైకాపా సర్పంచి జగదీష్ వ్యాఖ్యలు చేయడంతో సమావేశంలో దుమారం రేగింది. కొడవటిపూడికి చెందిన తెదేపా ఎంపీటీసీ సభ్యుడు యలమంచిలి ప్రకాశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వైకాపా, తెదేపా ప్రజాప్రతినిధుల మధ్య వివాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. ప్రొటోకాల్ పాటించాలని జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి గృహనిర్మాణ అధికారులను కోరారు. వైకాపా పాలనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఫిర్యాదు చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని బి.కొత్తపల్లి సర్పంచి లింగన్ననాయుడు ఎంపీడీఓను ప్రశ్నించారు. కోటవురట్లలో తాగునీటి కొరత ఉందని, అందువలన మంచినీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు కోరారు. ఉప ఎంపీపీ దత్తుడు సీతబాబురాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు శ్రీకారం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పక్షాల ప్రతినిధులతో సోమవారం సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29కి ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఉపాధ్యాయుల ఓటరు జాబితా తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయని చెప్పారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు సెకండరీ స్థాయి (ఆరో తరగతికి పైబడిన) పాఠశాలల్లో రెగ్యులర్ లేదా అడ్‌హాక్ ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు నమోదుకు అర్హులన్నారు. పార్ట్‌టైమ్ పద్ధతిలో పనిచేసే వారు అర్హులు కాదన్నారు. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు స్వీయ ధ్రువీకరణ పత్రం, సంబంధిత హెచ్‌ఓడీలు ఇచ్చే ధ్రువపత్రంతోపాటు డీఈఓ కౌంటర్ సైన్ చేసిన పత్రాలను సమర్పించాలన్నారు. కళాశాల అధ్యాపకులైతే ఆర్జేడీల నుంచి, వర్సిటీ స్థాయిలో అయితే వీసీ నియమించిన అధికారుల నుంచి కౌంటరు సైన్ తీసుకోవాలన్నారు. గతంలో ఓటరుగా ఉన్నవారూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - విద్యాశాఖ
కార్యనిర్వాహక ఇంజినీరువారి కార్యాలయము, సమగ్ర శిక్షా, అనకాపల్లి జిల్లా
స్వల్పకాలిక 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు నెం. 1/2024-25/APSS/AKP **తేది.** 30-09-2024

అనకాపల్లి జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా, కార్యనిర్వాహక ఇంజినీరువారిచే ఈక్రింద పేర్కొనిన పనులకు స్వల్పకాలిక 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ పిలవడమైనది.

నిట్ నెంబర్	పని పేరు	అంచనా విలువ లక్షల్లో
నిట్ నెంబర్ 1/24-25/ APSS/AKP తేది. 30-09-2024	అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అచ్యుతాపురం గ్రామమందు కబడ్డీ, వాలీబాల్ కోర్టు మరియు బ్యాడ్మింటన్ కోర్టు నిర్మించుట.	రూ. 10.00
నిట్ నెంబర్ 2/24-25/ APSS/AKP తేది. 30-09-2024	అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కొత్తూరు గ్రామమునందు లాంగ్ జంప్ పిట్ మరియు బ్యాడ్మింటన్ కోర్టు నిర్మించుట.	రూ. 6.00

ఎ. టెండరు షెడ్యూల్ల లభ్యత : తేది. 01-10-2024 ఉదయం 10.00 గంటల నుండి తేది. 14-10-2024 ఉదయం 10.00 గంటల వరకు
బి. టెండరు దాఖలుపరుచుటకు : తేది. 01-10-2024 ఉదయం 10.00 గంటల నుండి తేది. 14-10-2024 మధ్యాహ్నం 12.00 గంటల వరకు
సి. టెండర్లను తెరచు తేది : తేది. 14-10-2024 మధ్యాహ్నం 2.00 గంటలకు
టెండర్లను కోరే అధికారి పేరు మరియు చిరునామా : **కార్యనిర్వాహక ఇంజినీరు, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా, అనకాపల్లి, 8978300160, 8143143447**

ఆసక్తిగల బిడ్డర్లు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ఫ్లేస్ http://www.apeprocurement.gov.in నందు సమాచారము చూడవచ్చును.మరియు తమ వివరములు నమోదు చేసుకొనవలయును. తమ బిడ్స్‌ను ఆన్‌లైన్‌గా దాఖలుచేయవలెను.

47 కేజీల గంజాయి పట్టివేత

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి రవాణా అవుతున్న గంజాయిని మాడుగుల పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో తాటిపర్తి సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పాడేరు వైపు నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 47 కేజీల గంజాయి లభ్యమైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్‌కుమార్, అంకితఖోకర్‌ను అదుపులోకి తీసుకుని గంజాయి, కారును సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

విజయదశమికి ప్రత్యేక బస్సులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: విజయదశమి, దసరా సెలవుల నేపథ్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ విజయనగరం జోన్ ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలనాయుడు తెలిపారు. అనకాపల్లి గ్యారేజీ, డిపో, బస్‌స్టేషన్, పార్సిల్ కేంద్రాలను సోమవారం సందర్శించారు. హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం పట్టణాలకు ప్రత్యేక సేవలు ఏర్పాటు చేశామన్నారు. భవాని భక్తుల కోసం ప్రత్యేక బస్సులను సిద్ధం చేశామని, వివరాలకు బస్ స్టేషన్లలో సంప్రదించవచ్చన్నారు. సరకు రవాణాపైనా ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా డిపో, బస్ స్టేషన్, దుకాణ సముదాయం, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇన్‌ఛార్జి డీఎం రవిచంద్ర, ఎం.ఎఫ్. పీలా మల్లేశ్వరరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మత్స్యకారుడి మృతి



ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని సోమశిల ముంపు గ్రామం కొండమాచుపల్లె సమీపంలోని సోమశిల వెనుక జలాల్లో ఓ మత్స్యకారుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామానికి చెందిన **ఓ.మహంకాళి** (40) తన కుటుంబసభ్యులతో మూడు నెలల కిందట ఇక్కడకు వలస వచ్చారు. వెనుకజలాల్లో చేపలు పట్టడానికి మూడు రోజుల కిందట నావలో వెళ్లారు. ఆ తర్వాత ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, సహచర మత్స్యకారులు గాలింపు చేపట్టగా అతని మృతదేహం నీటిలో బయటపడింది. ఒంటిమిట్ట పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించడానికి వీలుకాకపోవడంతో వైద్యులే ఘటనాస్థలానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. నీటిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందారా, ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మహంకాళికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చినదొడ్డిగల్లు వాసిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు

తుని, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని పట్టణంలో అమ్మాజీపేట ప్రాంతానికి చెందిన ఎం.స్వర్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం చినదొడ్డిగొల్లు ప్రాంతానికి చెందిన పి.సూరిబాబుతో ఆమె కలిసి ఉండేదన్నారు. 2016లో ఖత్తర్ వెళ్లి ప్రతి నెలా జీతం డబ్బు 2022 ఫిబ్రవరి వరకూ సుమారు రూ. 78 లక్షలు సూరిబాబుకు పంపారన్నారు. తిరిగి ఆమె 2023 డిసెంబరులో వచ్చి సదరు వ్యక్తితో కలిసి కొంతకాలం ఉన్నారన్నారు. ఈ ఏడాది జనవరిలో డబ్బులు ఇవ్వాలని అడగ్గా ఇవ్వకుండా మోసం చేశాడని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైద్యురాలి తీరును నిరసిస్తూ ఆశా కార్యకర్తల ఆందోళన



ఆసుపత్రి వద్ద బైఠాయించిన ఆశా కార్యకర్తలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్త పట్ల జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న గైనిక్ వైద్యురాలు దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ఆసుపత్రి వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఎలమంచిలి మండలం నుంచి గర్భిణిని ప్రసవానికి తీసుకొచ్చిన సమయంలో ఆశా కార్యకర్తపై వైద్యురాలు విష్ణుప్రియ గట్టిగా అరవడంతో పాటు బయటకు గెంటేశారని ఆశా కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో తాము గర్భిణులను ఇక్కడికి తీసుకొస్తున్నామన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తమను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ సిబ్బందితో వచ్చి ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ వేరే గర్భిణికి శస్త్రచికిత్స చేస్తున్న సమయంలో ఎలమంచిలి మండలం నుంచి మరో గర్భిణిని తీసుకొచ్చారన్నారు. సాధారణ ప్రసవం జరుగుతుండగా రెండు చోట్లకు తాను పరుగులు పెట్టాల్సి వచ్చిందన్నారు. ఈ సమయంలో ఒత్తిడితో తాను కోపంగా మాట్లాడానని, క్షమించాలని చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఆర్నెల్లు ఆగితే మేయర్‌పై అవిశ్వాసం

విశాఖపట్నం: ఆర్నెళ్లు ఆగితే మేయర్‌పై అవిశ్వాసం పెట్టి మార్చేద్దామని ఎంపీ శ్రీభరత్ అన్నారు. జీవీఎంసీ అధికారులు, కమిషనర్‌తో మంగళవారం ఉదయం 11 గంటలకు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం తెదేపా కార్యాలయంలో కూటమి కార్పొరేటర్లతో భేటీ అయ్యారు. వైకాపా ప్రభుత్వం మారినా అవినీతి యథాతథంగా కొనసాగుతోందని కార్పొరేటర్లు అభిప్రాయపడ్డారు.

బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయినికి షోకాజ్ నోటీసు

తిరస్కరించిన టీచర్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని రాధారాణికి డీఈఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నోటీసును హెచ్ఎం హిమబిందు ఉపాధ్యాయినికి సోమవారం అందజేయగా.. తిరస్కరిస్తున్నట్లు రాసి తిరిగి హెచ్ఎంకు ఇచ్చారు. ఈమె సక్రమంగా విధులకు రావడంలేదని, పాఠాలు బోధించడం లేదని ఇటీవల విద్యార్థులు ధర్నా చేసిన విషయం తెలిసిందే.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	102	95
లైవ్	124	115
డ్రెస్‌డ్	180	200
స్కిన్‌లెస్	205	210

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా, రామచంద్ర, పర్తిసాయి, సత్యనారాయణ స్క్రీన్1, వెంకటేశ్వర: **దేవర**
శ్రీ సత్య: **జెంటిల్‌మేన్**
సత్యనారాయణ స్క్రీన్2: **మత్తు వదలరా**
షిర్డిసాయి: **సత్యం సుందరం**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1లో **సత్యం సుందరం,** స్క్రీన్-2లో **దేవర**

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే: అనకాపల్లి తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు ఎస్.రాయవరం నుంచి బదిలీపై అనకాపల్లి వచ్చారు. సోమవారం విధుల్లో చేరారు.

▼ కశింకోట తహసీల్దార్‌గా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విశాఖ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సత్యనారాయణ పాయకరావుపేటకు బదిలీ అయ్యారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా దీపారాధన

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూను అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలో సోమవారం ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా జనసేన ఆధ్వర్యంలో దీపారాధన చేపట్టారు. రింగురోడ్డు కూడలిలోని రామాలయం వద్ద ఓంకారం, త్రిశూలం, శంకుచక్రాల నమూనాలో దీపాలు వెలిగించారు. వీరమహిళలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.


దీపారాధనలో ప్రతినిధులు

అ వీ ఇ వీ

రేపటి నుంచి శిక్షణ తరగతులు

కశింకోట, న్యూస్‌టుడే: అక్టోబరు 2 నుంచి జాతీయ ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు స్పందించే హృదయం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు ఆచంట నాగేశ్వరరావు తెలిపారు. జడ్పీ పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ తరగతులకు ఆసక్తిగల విద్యార్థులు హాజరుకావాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 92963 58722 నంబరులో సంప్రదించాలన్నారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి పాలకులు కృషిచేయాలని సంఘం నాయకులు బయ్యవరపు సన్యాసిరావు, శ్రీనివాసరావు కోరారు. మండలకేంద్రంలో సోమవారం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. వృత్తిపరమైన పరికరాలు, రాయితీలు ఇవ్వడంతోపాటు పరికరాలను సమకూర్చుకోవడానికి రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం సీఐ నమ్మి గణేష్‌ను కలిశారు.


సీఐకు పూలకుండీ అందిస్తున్న ప్రతినిధులు

ఓటుహక్కు పొందాలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఓటు హక్కు లేని వారు తమ పేరు నమోదు చేయించుకోవాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి మనోరమ కోరారు. ఎలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో ఆమె ఓటర్ల నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా జనవరి 1లోగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. బీఎల్‌వోలను అందుబాటులో ఉంచామన్నారు. మార్పులు, చేర్పులు కూడా చేస్తారన్నారు. నాయకులు ఆడారి రమణబాబు, బొద్దపు శ్రీను, లాలం సోమినాయుడు, కరణం రవికుమార్ పాల్గొన్నారు.

బడి బస్సులు లేక అవస్థలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలకు బడిబస్సులు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండలశాఖ అధ్యక్షులు కేశవ విద్యార్థులతో కలిసి తహసీల్దార్ ఎస్. వరహాలరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. దిమిలి, పాయకరావుపేటలకు కొత్తగా బస్సులు వేయాలని కోరారు. బడి బస్సులు లేకపోవడం వల్ల విద్యార్థులు ఆటోల్లో రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో ఛార్జీలు భరించలేక చాలా మంది బడి మానేస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ పాల్గొన్నారు.

పంట కాలువలోకి మురుగు

ఎలమంచిలి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే

పట్టణంలోని మురుగునీటిని పంట కాలువల్లోకి మళ్లిస్తున్నారు. ఈ కారణంగా భూమిని నమ్ముకున్న అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. ఎలమంచిలి పట్టణాన్ని అనుకుని పంటకాలువ ఉంది. శారదానది నుంచి సాగు నీరు ఈ కాలువ ద్వారా రెండు వేల ఎకరాల పొలాలకు చేరి మిగులు నీరు పట్టణంలోని పెంజెరువులోకి చేరుతుంది. జలవనరుల శాఖకు చెందిన ఈ కాలువను ఏషియన్ రంగుల పరిశ్రమ సాయంతో అభివృద్ధి చేసి మరమ్మతులు చేపట్టారు. పక్కాగా గేటు వేశారు. తమ కష్టాలు తీరాయని రైతులు ఆనందించారు. నదిలో నీరు పుష్కలంగా ప్రవహించడంతో ఖరీఫ్‌లో ఢోకా ఉండదని రైతులు ఆనందంతో ఉన్నారు. ఇక్కడ పరిస్థితి చూస్తే మరోలా ఉంది. పట్టణంలోని మురుగునీరు రెండు కాలువల ద్వారా నేరుగా పంటకాలువలోకి చేరుతోంది.


ఎలమంచిలి పంటకాలువలోకి మళ్లించారు ఇలా..

ఈనీటితో పొలాలు చౌడుబారుతున్నాయి. నేల స్వభావం దెబ్బతిని దిగుబడులు తగ్గిపోతున్నాయి. ఒక పక్క స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్న మున్సిపాలిటీ రైతులను ఇబ్బంది పెట్టేలా ఇలాంటి పనులు చేయడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. మున్సిపల్, జలవనరుల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని కోరుతున్నారు.


నివాసాల మధ్య నిలిచిన మురుగు

కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

పట్టణంలో గృహ నిర్మాణాలు పెరిగాయి. కాలువలో వాడుక నీటితో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. పంటకాలువను మురుగునీటి కాలువగా మార్చేశారు. దీనిపై ప్రజా ప్రతినిధులు స్పందించాలి. **- రమణ, రైతు, ఎలమంచిలి**

వేరే మార్గంలేక..:

ఎలమంచిలిలో మురుగు నీరు తరలించడానికి వేరే మార్గంలేదు. పంట కాలువలోకి మురుగు చేరుతోంది. రైతులు ఇబ్బందులు పడటం వాస్తవమే! కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలనే యోచన ఉంది. ప్రతిపాదనలకు ఆమోదం లభించి నిధులు విడుదలైతే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
- పల్లా శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎలమంచిలి

అధ్వానంగా రహదారులు


కంచిపాటి వీధిలో..


భవానీకాలనీలో..

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోటలో పలు వీధులు చిత్తడిగా మారాయి. స్థానిక భవానీ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్, కంచిపాటి వీధి రహదారులపై కాలుపెట్టలేని పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో కాలువలు లేకపోవడంతో వాడుక నీరు రహదారిపై చేరింది. భవానీ కాలనీలో రహదారి కంటే కాలువలు ఎత్తులో ఉండటంతో నీరంతా రహదారిపై నిలిచిపోతోంది. కంచిపాటి వీధిలో కాలువలు శిథిలమయ్యాయి. వర్షం పడితే ఈపరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: సంపతిపురం కాలనీ వాసులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ధర్నా చేశారు. జగనన్న కాలనీ పేరిట తమకు స్థలాలను ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు, వీధి దీపాలు, రహదారులు వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు.


ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

సమస్యలపై వినతుల స్వీకరణ

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని రింగురోడ్డులో జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి అర్జీలతో తరలివచ్చిన వారి నుంచి స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. నాయకులు గొంతిన శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

కశింకోట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. కశింకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన చేశారు. రాష్ట్ర పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, వేగి గోపీకృష్ణ, గొంతిన శ్రీనివాసరావు, బుదిరెడ్డి చిన్న తదితరులు పాల్గొన్నారు.


జనసేన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పీలా గోవిందకు సన్మానం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను జిల్లా ఐ-టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఐ-టీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనకాపల్లి, చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గ ఐ-టీడీపీ అధ్యక్షులు పీలా శ్రీనివాస్, మలిపెద్ది సతీష్, రాపేటి గోపి, పార్లమెంట్ కమిటీ సభ్యుడు మడదా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


గోవిందను సన్మానిస్తున్న ఐటీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్

అర్హులకు టిడ్కో ఇళ్లు అందిస్తా!

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో టిడ్కో గృహాలు మంజూరైన వారందరికీ అందేలా చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసినా, వైకాపా ప్రభుత్వం వీటిలో చాలా మంది అర్హులకు ఇళ్లు ఇవ్వకుండా చేసిందని, ఇప్పుడు వారందరికీ వారందరికీ న్యాయం చేయడానికి మంత్రితో మాట్లాడానన్నారు. పాత జాతీయ రహదారి పనులు దుకాణాలు తొలగించడం సరికాదన్నారు. విస్తరణకు పనులకు నిధులు విడుదలైన తరవాత దీనిపై నిర్ణయం తీసుకుందామని చెప్పారు. మున్సిపల్ సమావేశంలోకి ఇతరులు రాకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీలో అన్ని అభివృద్ధి పనులు ఒకే గుత్తేదారుకు ఎందుకు ఇస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. మిగిలిన కాంట్రాక్టర్లకు ఎందుకు రానివ్వడం లేదని ప్రశ్నించారు. అజెండాలో అంశాలు తనకు ఎందుకు వివరించడంలేదని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైఎస్ విగ్రహం దిమ్మ తొలగించాలని కౌన్సిలర్ రామకృష్ణ సభలో కోరారు. పక్కాగృహాలు మంజూరైన వారు వచ్చే ఏడాది మార్చిలోగా ఇళ్లు పూర్తి చేయాలన్నారు. లేకపోతే రద్దు అవుతాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, డీఈ వీరయ్య, మున్సిపల్ అధికారులు పల్లా శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

పారిశుద్ధ్యంతోనే ప్రజారోగ్యం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం మెరుగుతోనే ప్రజా ఆరోగ్యం సాధ్యమని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి అచ్యుతాపురం కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

కార్మికుల సమస్యలపై వినతి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని సీఐటీయూ మండల కార్యదర్శి శివాజీ మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేసేవరకు పోరాటం

నక్కపల్లి, న్యూస్‌టుడే: విశాఖ-చెన్నై కారిడార్ భూసేకరణపై ఇటీవల వెలువరించిన నిర్వాసితుల కటాఫ్ నోటీసులను, లబ్ధిదారుల జాబితాను వ్యతిరేకిస్తూ నిర్వాసితులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. 2010-11 సంవత్సరాల కటాఫ్ తేదీలను అంగీకరించే ప్రసక్తి లేదన్నారు. ఎప్పుడు భూములు స్వాధీనం చేసుకుంటున్నారో దానినే కటాఫ్‌గా భావించాలని, 18 ఏళ్లు నిండి ఇళ్లు కోల్పోయిన వారికి రూ. 25 లక్షలు, బాధిత కుటుంబాలకు రూ. 15 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 17న కలెక్టరేట్‌లో, 23న తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్‌లో ఇచ్చిన దరఖాస్తులను పరిష్కారం చేయాలన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఆందోళనలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అప్పలరాజు, చందనాడ సర్పంచి తళ్ల రోహిణి భార్గవ్, ఉప సర్పంచి గంటా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితుల ఆందోళన

తంగేడు రాజులు చెప్పిందే చేస్తారా?

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల పీఏసీఎస్‌లో తంగేడు రాజులు చెప్పినట్లుగా విని ఉద్యోగం చేస్తామంటే ఒప్పుకొనేది లేదని తెదేపా నాయకులు, రైతులు ఆ సంఘం కార్యదర్శి రామకృష్ణకు స్పష్టం చేశారు. సోమవారం సహకార సంఘంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ జగనాథం మాట్లాడుతూ సంఘంలో 5,354 మంది సభ్యులున్నారని, రూ. 14 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. సహకార సంఘంలో తంగేడు రాజులు చెప్పినవారికే రుణాలిస్తున్నారని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, సుంకర బాబ్జి, పలువురు రైతులు ఆరోపించారు. సంఘంలో ఉండి మరణించినవారికి బీమా కూడా ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. రైతులందరితో చర్చించి, నిర్ణయాలు తీసుకోవాలని, రైతులకు పెట్టుబడి నిమిత్తం రుణాలను అందించాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది స్పష్టం చేశారు. లావాదేవీల వివరాలు రైతులందరికీ తెలియాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కమిటీ అధ్యక్షులు జానకీ శ్రీను, వేచలపు జనార్దన్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ చంటిబాబురాజు, సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో సిబ్బందితో మాట్లాడుతున్న రైతులు

ఓటమితోనే విజయం ప్రారంభం


అచ్యుతాపురంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అచ్యుతాపురం, ఎలమంచిలి గ్రామీణం, మునగపాక, న్యూస్‌టుడే: ఓటమితోనే విజయం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. అచ్యుతాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జీ, హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

▼ క్రీడా పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అచ్యుతాపురంలో జరిగిన కబడ్డీ పోటీల్లో కస్తూర్బాకు చెందిన సీహెచ్. వెంకటి, బి. బాలశ్రీ, ఎస్. శ్రావ్య, సీహెచ్. రేవతి ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఉమాదేవి తెలిపారు. పాటిపల్లి కస్తూర్బా విద్యాలయానికి చెందిన ఆర్. విజయశ్రీ, కె.యామిని, కె.చిట్టి, హేమ, చైతన్యజ్యోతి, జి.ప్రియాంక, నిహారిక, కె.యామిని, డి.త్రిష, ఎస్. తులసి, సంజన జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రాణి, వ్యాయామోపాధ్యాయురాలు సూరిశెట్టి శ్రీలక్ష్మి తెలిపారు. ఎలమంచిలిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి పోటీలకు ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పిల్లా రాహుల్, జి.పల్లవి, బి.విజయ్, జి.వినయ్, వై.మోహిత్, వి.భార్గవి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు షబ్బీర్ తెలిపారు.

కొత్తూరు (అనకాపల్లి), కశింకోట, న్యూస్‌టుడే: అనకాపల్లి ఏఎంఏఏ ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం కోరిబిల్లి లావణ్య తెలిపారు. వీరిని వర్తక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొణతాల లక్ష్మీనారాయణరావు, తమ్మన రఘుబాబు, యాజమాన్య కమిటీ అధ్యక్ష, కరస్పాండెంట్లు నారాయణరావు, శివకుమార్ అభినందించారు. కశింకోట బాలికోన్నత పాఠశాలకు చెందిన కె. భానుమతి, ఎన్. కావ్య, బి. సంధ్య, డి. ఉమ, ఎం. గ్రీష్మ, ఎం. సుస్మిత, వి. వేదిక, ఆర్. పుష్ప, ఎస్. లక్ష్మి, ఒ. అంజలి, పి. మేఘ వసంత, డి. భవాని, ఆర్. పుష్ప, ఒ. శిరీష, ఎన్. లావణ్య, ఎస్. పూర్ణిమ, కె. భానుమతి, టి. ఊర్మిళ, వై. పూజిత వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచినట్లు పీఈటీ కమల తెలిపారు. వీరిని హెచ్ఎం ఎం. ఎస్. స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఆళ్ల శ్రీను అభినందించారు.


ఎలమంచిలి విద్యార్థులు

ఎస్.రాయవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే: వమ్మవరం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి 10 మంది, చినగుమ్ములూరు ఉన్నత పాఠశాలల నుంచి 12 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికనట్లు హెచ్ఎం సత్తిబాబు, రమేష్ తెలిపారు. గొడిచెర్ల, చినదొడ్డిగల్లు ఉన్నత పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు నాగమణి, లోవకృష్ణ, ఆదిలక్ష్మి తెలిపారు.


చినదొడ్డిగల్లులో..


పాటిపల్లి విద్యార్థినులతో పీఈటీ శ్రీలక్ష్మి


కశింకోట విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆలయాల నిర్వహణను ధార్మిక సంస్థలకు అప్పగించాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాల నిర్వహణను ప్రభుత్వం హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పరిషత్ జిల్లా అధ్యక్షులు బంకుపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తిరుమల లడ్డూ వివాదంతో దేశంలో హిందూ భక్తులు మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. హుండీల్లో వేసే కానుకలను ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు దుర్వినియోగం చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు దేవాలయాల ఆస్తి, ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. హిందూయేతర, వ్యతిరేక కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్థ ప్రయోజనాలు కోసం దేవాలయాలను స్వాధీనం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తిరుపతి దేవస్థానంలో లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రతినిధులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని లక్ష్మీదేవిపేటలో సీసీ రోడ్లు గోతులుగా మారాయి. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
– ఎ.సరోజిని, అనకాపల్లి

✓: రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేశాం. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
– సుమిత్ర, జీవీఎంసీ జోనల్ ఏఈ

అంధకారంలో కశింకోట బస్‌స్టేషన్

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట బస్‌స్టేషన్‌లో విద్యుత్తు దీపాలు వెలగక అంధకారం అలుముకుంది. ఈ కారణంగా ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడుతున్నారు. దీంతో బస్సులు కూడా లోపలకు రాకుండా జాతీయ రహదారిపైనే నిలిపివేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు దీపాలు వెలిగించే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మోసయ్యపేటలో కూలిన చెట్టు.. నిలిచిన ట్రాఫిక్


రోడ్డుకు అడ్డంగా కూలిన మర్రిచెట్టు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో మోసయ్యపేట సామిల్లు వద్ద సోమవారం రాత్రి భారీ మర్రిచెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. ఆ సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న ఇద్దరు ద్విచక్ర వాహనచోదకులు, మోసయ్యపేటకు చెందిన కొమ్మోజు ఈశ్వరరావు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అచ్యుతాపురం సెజ్‌ని జాతీయరహదారిని కలిపే రోడ్డు కావడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. భారీ వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. చెట్టు కొమ్మలు విద్యుత్తు తీగలపై పడడంతో మోసయ్యపేటలో కొంత ప్రాంతానికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. పోలీసులు సకాలంలో హాజరుకాక ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. పలువురు మడుతూరు-కొండకర్ల మీదగా రాకపోకలు సాగించారు. రెవెన్యూ అధికారులు చెట్టును తొలగించడానికి ఏర్పాట్లు చేపట్టారు.


నిలిచిపోయిన బస్సులు, లారీలు

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల


తుప్పలు తొలగించాక రహదారి ఇలా..

ఆసుపత్రి దారిలో తుప్పల తొలగింపు

స్పందనకు వందనం

చీడికాడ, న్యూస్‌టుడే: అర్జునగిరిలో ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి బాగుపడింది. ఈ రోడ్డు తుప్పలతో మూసుకుపోవడంతో 'ఆసుపత్రికి వెళ్లాలంటే గుబులు' శీర్షికన గత నెల 24న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో ఆసుపత్రికి వచ్చే వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దగ్గరి దారులు వదిలి దూరప్రయాణం

గొలుగొండ, న్యూస్‌టుడే

రహదారుల నిర్వహణపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై తట్టెడు మట్టి కూడా పోయలేదు. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ గోతులు పడ్డాయి. ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు గుంతలు మరింత విస్తరించాయి. దీంతో ఈ రోడ్లమీద ప్రయాణించే వాహనచోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. దీంతో కొన్ని గ్రామాల ప్రజలు నుంచి 10 కిలోమీటర్ల దూరంలో గమ్యస్థానాలు చేరుకోవడానికి కాస్త బాగున్న రోడ్లు పట్టుకుని 15, 20 కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. ఇందుకు జోగుంపేట నుంచి తాండవ మీదుగా నాతవరం, గుండుపాల నుంచి కొత్తఎల్లవరం, కరక, పాకలపాడు-రావణాపల్లి కూడలి మధ్య రహదారులు ఉదాహరణగా కనిపిస్తున్నాయి.


జోగుంపేట నుంచి నాతవరం వెళ్లే రహదారిలో గోతులు


గుండుపాల-కొత్తఎల్లవరం రహదారి దుస్థితి


పాకలపాడు-రావణాపల్లి కూడలి మధ్య దారి ఇలా..

విద్యాలయాల్లో దాతృత్వ పరిమళాలు

విద్యార్థులకు ఒనగూరిన వసతులు

నర్సీపట్నం అర్బన్, రోలుగుంట, న్యూస్‌టుడే:

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు దాతలు చొరవచూపుతున్నారు. ఎండైనా, వానైనా మధ్యాహ్న భోజనం పథకం అమలుకు ఇబ్బంది లేకుండా షెడ్ల నిర్మాణం చేపట్టారు. కళావేదికల నిర్మాణంతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు తొలగాయి. బలిఘట్టం జడ్పీ హైస్కూల్ ఆవరణలో కళావేదిక నిర్మాణానికి వ్యాపారవేత్త వెలగా నారాయణరావు రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈ పాఠశాల విద్యార్థులంతా ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని ప్రతినబూనారు. నర్సీపట్నంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో ఇటీవల డొక్కా సీతమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రూ.2.5 లక్షల వ్యయంతో కళావేదిక నిర్మించారు. డిగ్రీ కళాశాలకు, బాలికల గురుకులానికి ఆర్వో ప్లాంట్లు సమకూర్చారు. బాక్సింగ్ క్రీడాకారులు శిక్షణ సమయంలో గాయపడకుండా నింజాస్ అకాడమీకి రబ్బరు చాపలు అందజేశారు. వ్యాపారవేత్త సుతాపల్లి శ్రావణ్ రూ.1.5 లక్షలతో మధ్యాహ్న భోజనం తయారీకి షెడ్డు నిర్మించారు. పట్టణానికి చెందిన వైద్యులు బొంతు జగదీష్, బిందు నాలుగు సిమెంట్ బెంచీలు సమకూర్చారు. ట్రస్టు తరఫున అల్లాడ సురేష్ విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందజేయడంతోపాటు చదువులో రాణించే వారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. వైద్యుడు మారుతీకృష్ణ విద్యార్థులు కూర్చునేందుకు బల్లలను సమకూర్చారు. పెదబొడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో సుతాపల్లి శ్రీకాంత్ రూ.3 లక్షల వ్యయంతో కళావేదిక నిర్మించారు.



బలిఘట్టం పాఠశాలలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా కళావేదిక

విలువైన స్థలాల వితరణ

విద్యాభివృద్ధి కాంక్షిస్తూ విలువైన భూములు, స్థలాలను వితరణగా అందజేశారు రోలుగుంట మండలానికి పలువురు దాతలు. కొమరవోలుకు చెందిన దివంగత ఎమ్మెల్యే గొర్లె కృష్ణంనాయుడు కుమారుడు రామ్మూర్తినాయుడు అలియాస్ పెదబాబు 2004లో రెండు ఎకరాలకు హైస్కూలు ఏర్పాటుకు ఇచ్చారు. ఎం.కె.పట్నం శివారు ఛటర్జీపురంలో ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన నల్లి దాలయ్య 80 సెంట్ల స్థలాన్ని దానం చేశారు. కొంతలం జడ్పీ పాఠశాలకు ఆ ప్రాంతానికి చెందిన ఆశ్వార్డ్ సంస్థ నిర్వాహకుడు రవీంద్రనాథ్ కొద్దిరోజుల కిందట ఎకరా భూమిని అందజేశారు.


నల్లి దాలయ్య ఇచ్చిన స్థలంలో ప్రాథమిక పాఠశాల

అన్నిచోట్లా వెల్లివిరియాలి



ప్రభుత్వ పాఠశాలల్లో కళావేదికలు నిర్మించడం హర్షణీయం. ఈ స్ఫూర్తి అన్నిచోట్లా వెల్లివిరియాలి. పాఠశాలల అభివృద్ధికి కృషి చేసే ఉపాధ్యాయులు ఉన్నచోట్ల సదుపాయాలు కల్పించేందుకు దాతలు ముందుకువస్తారు. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులూ మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరముంది.

– అప్పారావు, జిల్లా ఉప విద్యా శాఖ అధికారి

భూ సమస్యలపైనే ఎక్కువ అర్జీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సోమవారం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భూ సమస్యలపై ఎక్కువ అర్జీలు దాఖలయ్యాయి. డివిజన్ పాలనాధికారి సూర్యనారాయణ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 15 దరఖాస్తులు అందాయి. ఆన్‌లైన్ నుంచి తొలగించిన తన భూమి వివరాలను అందులో చేర్చి తనకు న్యాయం చేయాలని కోరుతూ చెట్టుపల్లికి చెందిన సేనాపతి రామారావు వినతిపత్రం అందజేశారు. కొత్తకోటలోని తన ఇంటికి దారిలేకుండా కంచె వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గోవాడ పార్వతి కోరింది. బుచ్చెంపేట గ్రామంలో వేరే పేర్లతో వెబ్‌ల్యాండ్‌లో నమోదైన తన భూమి వివరాలను మార్చాలని గాలి అమ్మాజీ విజ్ఞాపనను అందజేసింది.


వినతులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టరేట్ ఏఓ సూర్యనారాయణ

ఉపాధ్యాయ వృత్తిలోనే సంతృప్తి


ప్రసాదవర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, సబ్ కలెక్టరు ప్రసాద్ తదితరులు

దేవరాపల్లి, మాకవరపాలెం, న్యూస్‌టుడే: సమాజంలో ఉపాధ్యాయ వృత్తిలోనే ఎక్కువ సంతృప్తి ఉంటుందని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఎ.కొత్తపల్లి జడ్పీ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన పి. రాజేంద్రప్రసాదవర్మను సోమవారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని స్వర్ణలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టరు ప్రసాద్, ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచి వెంకటరమణ, అప్పలనరసమ్మ, బండారు దేముడు నాయుడు పాల్గొన్నారు.

జి.కోడూరు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఆర్. వరహాదేముళ్లు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి రఘువర్మ హాజరయ్యారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్.శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వరహాదేముళ్లు దంపతులను సత్కరించారు. పి.ఎస్. మల్లేశలింగం, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.వి.దొర పాల్గొన్నారు.

రావికమతం: సమాజానికి మంచి పౌరులను అందించేంది ఉపాధ్యాయులేనని పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొత్తకోటలో ఉపాధ్యాయిని వెంకట నాగలక్ష్మి ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగలక్ష్మిని ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే గాదె శ్రీనివాసులునాయుడు, ముర్రు ముత్యాలునాయుడు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ సత్కరించారు.

అంతా మీ తప్పిదమే!

అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నం పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటైన కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా తీవ్ర వాగ్వాదాల మధ్య కొనసాగింది. మున్సిపల్ సాధారణ నిధుల వినియోగం, ఇసుక పాలసీలపై మాటామాటా పెరిగి ఒకదశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి సమావేశానికి అధ్యక్షత వహించారు. తొలుత వైకాపా కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుకు ఎట్టకేలకు చర్యలు తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉన్నా ఆ పనులకు సాధారణ నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో వీటికి వేరే గ్రాంట్ల నుంచి మాత్రమే ఖర్చు చేయాలి మినహా సాధారణ నిధులు వెచ్చించకూడదని చెప్పేవారు. ఇప్పుడు ఏకంగా రూ. 1.7 కోట్లు దీని కోసం వినియోగించాలని నిర్ణయించడం పద్ధతేనా అన్నారు. దీనిపై తెదేపా కౌన్సిలర్లు దనిమిరెడ్డి మధు, డబ్బీర్ శ్రీకాంత్‌లు మాట్లాడుతూ మీ పాలనలో పారిశుద్ధ్యాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించడం వల్లే దానిని గాడిలో పెట్టడానికి వాహనాలు తదితర వాటికి ఇంత పెద్ద మొత్తంలో కేటాయించే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిపై ఇరు వర్గాల సభ్యులు పరస్పరం విమర్శలకు దిగారు. మున్సిపాలిటీలోని నందనవనంలో గతంలో ఎమ్మెల్యే బాక్సింగ్ రింక్‌కు కేటాయించిన స్థలాన్ని ఎందుకు రద్దు చేశారో తెలియజేయాలని కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ కమిషనర్ జంపా సురేంద్రను కోరారు. క్రీడా ప్రాధికార సంస్థే దీనిని రద్దు చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని సదుపాయాలతో కూడిన ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించారని కమిషనర్ తెలిపారు. ఎవరికి సమాచారం లేకుండానే రద్దు చేస్తారా అంటూ రామకృష్ణ ప్రశ్నించడంతో మళ్లీ ఇరు పార్టీల సభ్యులు వాగ్వాదాలకు దిగారు. అయిదేళ్లలో మీరు చేసింది ఏమీ లేదని రహదారి విస్తరణ పనులు సగం చేసి వదిలేశారని.. ఆఖరికి ఇసుకను తినేశారని.. అవినీతి, లంచాలతోనే మీ పాలన కొనసాగిందని తెదేపా సభ్యులు విమర్శించారు. దీనికి ప్రతిగా కోనేటితో పాటు ఆ పార్టీ కౌన్సిలర్లు బుల్లిదొర, తమరాన అప్పలనాయుడులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గణేష్ తన స్థాయికి మించి ఎంతో అభివృద్ధి సాధించారని పేర్కొన్నారు. మీరే ఉచిత ఇసుక అని దానిని గత నాలుగు నెలలుగా ఎవరికి దక్కకుండా చేశారని విమర్శించారు. దీంతో ఇరు వర్గాలు ఎవరికి వారే తామే గొప్ప అంటూ వాదించుకున్నారు. తెదేపా కౌన్సిలర్ చింతకాయల రాజేష్ మాట్లాడుతూ ఉచిత ఇసుకకు జీఓ మాత్రమే విడుదల అయిందని, ఇంకా సమగ్ర విధానం రూపొందలేదని... పది రోజుల్లో శాసన సభాపతి నర్సీపట్నం వచ్చిన తరువాత దీని విషయాన్ని పరిశీలిస్తారని తెలిపారు. కొత్తవీధిలోని రోడ్డు విస్తరణలో ఏర్పాటు చేసిన విగ్రహాల వెనుక రిటైనింగ్ గోడ నిర్మాణాన్ని అప్పట్లో విస్మరించి ఇప్పుడు కట్టాలని ప్రతిపాదించడాన్ని తెదేపా కౌన్సిలర్ శ్రీకాంత్ విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ కొత్త బడ్జెట్ అమల్లో ఉన్న మేరకే పారిశుద్ధ్యం అభివృద్ధికి సాధారణ నిధులు వినియోగించ వచ్చని తెలిపారు. ఇంకా ఇతర సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి


వైకాపా కౌన్సిలర్లు, తెదేపా సభ్యుల మధ్య వాగ్వాదం

బొడ్డేరుకు వరద ఉద్ధృతి

చీడికాడ, రావికమతం: న్యూస్‌టుడే: బొడ్డేరు నది ఉగ్రరూపం దాల్చి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి కోనాం జలాశయానికి వస్తున్న వరద నీటిని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీటితోపాటు కొండ గెడ్డలు బొడ్డేరులో కలుస్తున్నాయి. సిరిజాం, బి. సింగవరం, కె.అగ్రహారం సమీపంలో నదిలో వరద ఉద్ధృతి అధికంగా ఉంది. పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులని హెచ్చరికలు జారీ చేశారు.

కల్యాణపులోవ జలాశయ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. సోమవారం రెండు గేట్లను ఎత్తి 100 క్యూసెక్కులు సర్పానదిలోకి విడుదల చేసినట్లు ఏఈ సత్యనారాయణ దొర చెప్పారు.


కె.అగ్రహారం వంతెన వద్ద బొడ్డేరులో ప్రవాహం

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు కోరారు. కొర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. విద్య, వైద్య, మున్సిపల్ శాఖల్లో ఒప్పంద, పొరుగుసేవల విధానంలో అనేకమంది ఏళ్ల తరబడి పనిచేస్తున్నారన్నారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘ నాయకులు లోవరాజు, అర్జున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **సత్యం సుందరం,** ఆడి2: ఆడి3: **దేవర,** ఆది4: **దేవర, మత్తు వదలరా,** రాజు: **దేవర, సత్యం సుందరం,** బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం,** సాయిలక్ష్మి: **మత్తు వదలరా,** పూర్ణా: **దేవర**

అ వీ ఇ వీ

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

రావికమతం: స్థానిక విద్యుత్తు ఉప కేంద్రంలో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్ఈ (ఆపరేషన్స్) ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఇకపై లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. ఈఈలు రామకృష్ణారావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

చీడికాడ: సిరిజాం పంచాయతీ ఎస్.గదబూరులో గిరిజనులకు ప్రభుత్వం సరఫరా చేసిన దోమతెరలను సోమవారం పంపిణీ చేశారు. మాజీ సర్పంచులు చెల్లంనాయుడు, దాలినాయుడు, కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

వానపాములతో వర్మీకంపోస్టు

చీడికాడ, న్యూస్‌టుడే: జైతవరం సంపద తయారీ కేంద్రంలో వానపాములతో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయనున్నట్లు సర్పంచి సత్యవతి చెప్పారు. కేంద్రంలోని కుండీల్లో ఎంపీటీసీ సభ్యుడు ముత్యాలనాయుడుతో కలిసి సోమవారం వానపాములను వదిలారు.

అనువాదంతో విజ్ఞాన విస్తరణ

మాకవరపాలెం: ప్రపంచ భాషల్లో ఉన్న సాహిత్యం, విజ్ఞానం, చరిత్ర అందరికీ తెలియజేయడానికి అనువాదం ఎంతో ఉపయోగపడుతుందని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అనువాద దినోత్సవం నిర్వహిచారు.

తహసీల్దారు, ఎస్సై బాధ్యతల స్వీకారం

మాడుగుల గ్రామీణం: మాడుగుల తహసీల్దారుగా రమాదేవి, ఎస్సై జి.నారాయణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భాజపా, జనసేన నాయకులు రాజు, ప్రసాదరావు, వాసు, సాయిరాం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

గోతులతో వాహన చోదకులకు సంకటం

గొలుగొండ, న్యూస్‌టుడే: నర్సీపట్నం నుంచి గొలుగొండ మీదుగా పాతకృష్ణదేవిపేట వెళ్లే ప్రధాన రహదారిపై అనేక చోట్ల ప్రమాదకరమైన గోతులు ఏర్పడ్డాయని సీపీఐ జిల్లా సహాయ కార్యాదర్శి రామునాయుడు తెలిపారు. సోమవారం ఇక్కడ గొయ్యిలను పరిశీలించి మాట్లాడారు. వీటిని పూడ్పించకపోతే ద్విచక్ర వాహన చోదకులకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు.

గురుకులంలోకి నాలుగు పోలింగ్ కేంద్రాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ రమణ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఓటర్లకు అందుబాటులో ఉండేలా పెదబొడ్డేపల్లిలో పోలింగ్ కేంద్రాలను మార్చాలని రాజకీయ పార్టీల నాయకులు ప్రతిపాదించారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి పార్టీల నాయకులతో రెవెన్యూ డివిజన్ అధికరారి రమణ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బొడ్డేపల్లిలోని ఆర్‌సీఎం పాఠశాలలోని ఒక పోలింగ్ కేంద్రం, జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలోని రెండింటిని, ఎంపీపీ స్కూల్‌లోని మరొకటి కలిపి మొత్తం నాలుగింటిని గురుకుల పాఠశాలలోకి మార్చాలని నిర్ణయించినట్లు ఆర్‌డీఓ పార్టీల నాయకులకు తెలిపారు. దీనిపై వీరి అభిప్రాయాలను సేకరించారు. అందరూ సానుకూలంగా స్పందించినట్లు చెబుతున్నారు. దీంతో ఈ ప్రతిపాదనను కలెక్టర్‌కు నివేదించాలని నిర్ణయించారు. ఇందులో తహసీల్దారు రామారావు, ఎన్నికల ఉప తహసీల్దారు సుధావాణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డ్వాక్రా ఉత్పత్తులు


ఉత్పత్తులను పరిశీలిస్తున్న సుబ్బలక్ష్మి, కౌన్సిలర్ రాజేష్

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పెదబొడ్డేపల్లిలోని రైతు బజారు వద్ద సోమవారం ఏర్పాటైన డ్వాక్రా ఉత్పత్తులు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. మున్సిపాలిటీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ పేరిట వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్త్రాలు, ఫ్యాన్సీ వస్తువులు, బొమ్మలు, ఆహార పదార్థాలను ప్రదర్శించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, తెదేపా కౌన్సిలర్ చింతకాయల రాజేష్ తదితరులు వీటిని సందర్శించారు. మెప్మా ఉద్యోగులు వరలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు

రావికమతం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం కొత్తకోట-4 అంగన్‌వాడీ కేంద్రాన్ని సాక్ష్యం కేంద్రంగా ఎంపిక చేసినట్లు సూపర్‌వైజర్ విజయలక్ష్మి చెప్పారు. ఈ కేంద్రాన్ని సర్పంచి లోవరాజు, ఉప సర్పంచి దేవా సోమవారం ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు మెరుగైన సేవలు అందించనున్నట్లు చెప్పారు. అనంతరం పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.

మాడుగుల గ్రామీణం, చీడికాడ, కె.కోటపాడు: కింతలి వల్లాపురం, ఎం.కోడూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు బాల సంజీవని కిట్లు పంపిణీ చేశారు. అప్పలరాజుపురంలో పోషకాహార మాసోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గర్భిణులను సన్మానించారు. పోషణ మాసోత్సవ్ ముగింపు సందర్భంగా రామచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సీడీపీఓ మంగతాయారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నర్సీపట్నం అర్బన్: నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లోని 18 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఎల్ఈడీలు, శుద్ధజల పరికరాలు, కుర్చీలు, టేబుళ్లు తదితర సామగ్రిని పంపింది. వేములపూడి కేంద్రంలో సోమవారం ఏర్పాటైన ప్రారంభ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, సీడీపీవో మేరీ సువార్త పాల్గొన్నారు.


కొత్తకోటలో పోషకాహార ప్రదర్శన

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతే సేవ

చోడవరం పట్టణం, మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం స్వచ్ఛతే సేవ కార్యక్రమాలు జరిగాయి. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సీవీఎస్ఎస్, వైద్యాధికారి చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ సూచించారు. జాతీయ సేవా పథం ఆధ్వర్యంలో విద్యార్థులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు



శ్రమదానంలో పాల్గొన్న మాడుగుల విద్యార్థులు

సభ్యత్వ నమోదులో ముందుండాలి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదులో మాడుగుల నియోజకవర్గం ముందుండాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు అన్నారు. కుంద్రపువానిపాలెంలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు, గ్రామ, మండల స్థాయి కమిటీలతో సోమవారం సమావేశమయ్యారు. తెదేపా మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్ అధ్యక్షత వహించారు. నాయకులు పైలా ప్రసాదరావు, కన్నూరు సూర్యనారాయణ, కశిరెడ్డి అప్పలనాయుడు, లెక్కల మల్లేశ్వరరావు, కిలపర్తి భాస్కరరావు, దేముడునాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, సబ్బవరపు రామునాయుడు, దాడి ఎరుకునాయుడు, బండారు నర్సింహనాయుడు, జూరెడ్డి రాము పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అప్పలనాయుడు

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా దీపారాధన

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా మాడుగుల కొబ్బరి తోట వీధిలోని సీతారామ స్వామి వారి ఆలయంలో సోమవారం దీపారాధన చేపట్టారు. విశ్వ హిందూ పరిషత్తు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు జనసేన నాయకులు చెప్పారు.

వినాయక మండపంలో అన్నసమారాధన

రావికమతం, దేవరాపల్లి, న్యూస్‌టుడే: గుడ్డిపలో దబాంగ్ దిమ్మ బాయ్స్ యూత్ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం అన్నసమారాధన జరిగింది. గుడ్డిప, జి.కొత్తూరు, తట్టబంద, బలిజిపాలెం, బూరుగుపాలెం, గొంప తదితర గ్రామాలకు చెందిన భక్తులకు అన్నప్రసాదం స్వీకరించారు. భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లవ్‌లీ బాయ్స్ ఆధ్వర్యంలో దేవరాపల్లిలో వినాయక నిమజ్జనోత్సవం సందడిగా జరిగింది. కోయ నృత్యాలు, కోలాటాలు, బళ్లవేషాలు ఆకట్టుకున్నాయి. భాజపా రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, తెదేపా, జనసేన నాయకులు పైలా ప్రసాదరావు, కిలపర్తి భాస్కరరావు, జి.రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి ప్రోత్సాహం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: కాశీపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. తొమ్మిది తరగతి విద్యార్థి రెడ్డి రాముడు విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన పోటీల్లో జట్టును మూడో స్థానంలో నిలిపారు. అతడికి ప్రోత్సాహకంగా గ్రామానికి చెందిన డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు ప్రకటించిన మొత్తాన్ని చెక్కు రూపేణా విశ్రాంత పోస్టు మాస్టర్ అక్కునాయుడు సోమవారం అందజేశారు. ఇదే పాఠశాలకు చెందిన భానుప్రకాష్, గణేష్ క్రీడల్లో రాణిస్తున్నారని ప్రధానోపాధ్యాయిని సుందరి చెప్పారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల సత్తా


రావికమతం మండలంలో ప్రతిభ చూపిన బాలికలు

నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, న్యూస్‌టుడే: నర్సీపట్నం బాలుర పాఠశాల విద్యార్థులు 32 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గం స్థాయిల్లో చేపట్టిన ఆటల పోటీల్లో వీరు విజయం సాధించారు. వీరిని ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.వినోద్ ప్రత్యేకంగా అభినందించారు. కబడ్డీ, ఖోఖో, చదరంగం, అథ్లెటిక్‌లో రాణించిన పదిమంది మాకవరపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు అచ్యుతరామయ్య తెలిపారు. గొలుగొండ మండలం జోగుంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్, షాట్‌పుట్, పరుగు పందెం పోటీల్లో సత్తాచాటారు. ప్రధానోపాధ్యాయిన సరోజిని, వ్యాయామ ఉపాధ్యాయులు లోవరాజు, సుబ్బారావు తదితరులు పతకాలు సాధించిన పిల్లలకు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు 120 మంది

రావికమతం, న్యూస్‌టుడే: కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లో 120 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త చర్ల కన్నంనాయుడు, మండల సమన్వయకర్త లక్ష్మణరావు చెప్పారు. హెచ్‌ఎం మల్లికార్జునరావు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ బూసాల అప్పారావు బాలికలను అభినందించారు.

చీడికాడ, న్యూస్‌టుడే: వరహాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ధర్మిశెట్టి వసంత 100, 200 మీటర్ల పరుగు పోటీలో, కరణం జ్యోతి 600 మీటర్లలో ప్రథమ, 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-17 విభాగంలో వసంత 3 వేల మీటర్లు, కృష్ణవేణి 400 మీటర్ల పరుగులో మొదటి స్థానాలు, బాలుర విభాగంలో లోవర్ధన్ 800 మీటర్ల పరుగులో మొదటి స్థానం, నీలవర్ధన్ 800 మీటర్ల పరుగు, ట్రిపుల్ జంప్‌లో రెండో స్థానం సాధించారు. డిస్కస్ త్రోలో మాధురి ప్రథమ, షటిల్ బ్యాడ్మింటన్‌లో జయంతి, లక్ష్మీనారాయణ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఖోఖోలో జ్యోతి, వసంత, రాజేశ్వరి, కృష్ణవేణి, దీపిక, గోవర్ధన్, లోవర్ధన్, పవన్, మనోహర్ ఎంపికయ్యారని పీడీ సింహాచలం చెప్పారు.

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -17 విభాగంగా బి.లక్ష్మీనారాయణ, అండర్-14 విభాగంలో ఎస్. వంశీకృష్ణ ప్రథమ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం జగన్నాథరావు, పీడీ సూర్యనారాయణ చెప్పారు.

మాడుగుల గ్రామీణం: ఖోఖో అండర్-17, 14 విభాగాల్లో ఒమ్మలి బాలలు ప్రథమ స్థానాల్లో నిలిచారు. జిల్లా స్థాయి పోటీలకు 15 మంది ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్‌నాయుడు చెప్పారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

నర్సీపట్నం/అర్బన్, నాతవరం, న్యూస్‌టుడే: విజన్ ఆఫ్ స్వర్ణాంధ్ర-2047 అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలో నర్సీపట్నం నలంద స్కూలు విద్యార్థిని పి. మౌనిక, శ్రీచైతన్య విద్యార్థి కె.యజ్ఞదీప్ ద్వితీయ స్థానంలో నిలిచారు. 'విద్యా రంగంలో సంస్కరణలు' అంశంపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో గునుపూడి జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థిని గానుగుల ప్రశాంతి ప్రథమ బహుమతి అందుకుంది. వీరికి కలెక్టర్ విజయకృష్ణన్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


ప్రశాంతికి ప్రశంసా పత్రం ఇస్తున్న కలెక్టర్

పెందుర్తి

విశ్వేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో నెయ్యి కల్తీ వ్యవహారం నేపథ్యంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రాయశ్చిత్త దీక్ష చేసి మద్దతు తెలిపారు. సోమవారం సాయంత్రం చినముషిడివాడ దరి విశాలాక్షి విశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు ఎమ్మెల్యేతో పూజలు చేయించారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించి పరమేశ్వరుడిని సేవించారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడలో సాధన సంస్థ ఆధ్వర్యంలో రాంకీ ఫౌండేషన్ సహకారంతో సోమవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. తొలుత రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, సాధన సంస్థ అధ్యక్షులు పైలా గోపి దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో 30 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ 1620 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని.. వారంతా ఇంటివద్ద స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఆర్జిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాధన కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, శిక్షకురాలు లక్ష్మి, నాగలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాధన సంస్థ కార్యదర్శి ఇస్మాయిల్

మర్యాద పూర్వక కలయిక

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి సబ్ రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎ.కీర్తిప్రియ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక రత్నగిరినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకుడు పి.సన్యాసిరావు, రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధి చిన్నారావు పాల్గొన్నారు.

పెందుర్తి తహసీల్దారుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.ఆనందకుమార్‌ను 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే రమేశ్‌బాబును కలిసిన పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కీర్తిప్రియ, సిబ్బంది

శారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: విశాఖ శారదాపీఠంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయని పీఠం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది నుంచి రాజశ్యామల సువాసినీ శక్తి దీక్షను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలిసారిగా మహిళలు పూజల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల సహిత చండీయాగం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవంలో ప్రతి నిత్యం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. నిత్యార్చన, హోమాలు, శారదామాతకు విశేష అభిషేకాలు, శ్రీచక్ర నవావరణార్చన, తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి పిలుపునిచ్చారు. పూజల్లో పాల్గొనాలనుకునే భక్తులు 94403 93333 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర తెలుగునాడు విభాగ ఉత్తరాంధ్ర కార్యదర్శిగా సత్యానంద్

వేపగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర జోనల్ కార్యదర్శిగా వేపగుంటకు చెందిన పి.వి.సత్యానంద్ ఎంపికయ్యారు.



రెండు రోజుల క్రితం జిల్లా తెదేపా కార్యాలయంలో ఉద్యోగులు, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆయనను ఎంపిక చేశారు. ప్రస్తుతం మలేరియా సబ్‌యూనిట్ కార్యాలయంలో హెల్త్ సూపర్‌వైజరుగా పని చేస్తున్నారు. గతంలో పలు ఉద్యోగుల సంఘాల్లో పని చేశారు. ఈ అవకాశం కల్పించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర పోషణ.. సమీకృత అభివృద్ధి దిశగా..

పెందుర్తి, న్యూస్‌టుడే

ఆరేళ్ల లోపు బాలల నుంచి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల వరకు వారి సమగ్ర పోషణ, పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ.. సక్షం పేరిట అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలనే మెరుగుపరిచి సక్షం (సిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కేంద్రాలుగా రూపొందించింది. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 19 కేంద్రాలు సక్షం కింద ఎంపికయ్యాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

సదుపాయాలు ఇలా..

సక్షం పథకంలో ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సదుపాయాలు కల్పించాయి. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదల, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈ వసతులున్నాయి.

● చిన్నారులకు బాల్యారంభ దశ సంరక్షణ, విద్యా బోధనలో భాగంగా కుర్చీలు, టేబుళ్లు, ఇతర వసతులు కల్పించారు.

● పోషణ వాటిక పేరిట అంగన్‌వాడీల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతారు. ఇక్కడ పండిన వాటిని తల్లీబిడ్డలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారంగా అందజేస్తారు.



పులగవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ్ వాటిక

● బాలలను ఆకట్టుకునే విధంగా బోధన చేయడం కోసం దృశ్యశ్రవణ విద్యను అందించేందుకు ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీని ఏర్పాటు చేశారు. అంతర్జాలంతో పాటు స్టోరేజ్ డివైజ్‌ల ద్వారా పాటలు, ఆటలు, పాఠాలను ప్రదర్శిస్తారు.



ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంటు

● నాణ్యమైన రక్షిత నీటిని అందించి రోగాల నుంచి కాపాడేందుకు మంచినీటి శుద్ధీకరణ యంత్రాలను అమర్చారు.

● పిల్లల శారీరక, మానసిక, భావనాత్మక అభివృద్ధికి దోహదం చేసేలా కేంద్రాలను ఆకర్షణీయంగా అలంకరించి వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులు సమకూర్చారు.

● ఆవరణలో వాన నీటి సంరక్షణ చర్యలకు పిట్ ఏర్పాటు చేశారు.

పెందుర్తి ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాలు ఇవే..

పెందుర్తి వైట్‌హౌస్ దరి చిన్నమిల్లు ఏరియా, పాత పెందుర్తి-1, పులగవానిపాలెం, రాంపురం, శ్రీరాంపురం, వెంపేట, గంగమ్మపేట, కరకవానిపాలెం, కోట్నివానిపాలెం, ముదపాక, ఎస్‌ఆర్‌పురం, ఎస్‌ఆర్‌పురం కాలనీ, జుత్తాడ, పెదగాడి, జుర్రివానిపాలెం, నందవరపువానిపాలెం, నరవ-2, ప్రహ్లాదపురం, పిట్టవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాలు సక్షం కేంద్రాలుగా ఎంపికైనట్లు సీడీపీవో నీలవేణి పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: సబ్బవరం మేజరు పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ నుంచి బాలాజీ ఆసుపత్రి వరకు కాలువ లేక వర్షపు నీరు వచ్చే మురుగునీరంతా రోడ్డుమీద నుంచే పారుతోంది. - ఆర్.సత్యనారాయణ, సబ్బవరం

సమాధానం: పంచాయతీ సమావేశంలో సంబంధిత సమస్యను చర్చించి పరిష్కరిస్తాం. - కె.మూర్తిబాబు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సబ్బవరం, న్యూస్‌టుడే

సమస్య: 97వ వార్డు పురుషోత్తపురం శివాలయం వెనుక ప్రాంతంలో 365/24/3 స్తంభానికి ఉన్న వీధి దీపం చాలా కాలం నుంచి వెలగడం లేదు. - సూర్యభవాని, పురుషోత్తపురం

పరిష్కారం: త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - దుర్గాప్రసాద్, ఏఈ, 95వ వార్డు

పీలా గోవింద్‌కు అభినందనలు

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణ రావు, రాంపురం గ్రామ నాయకులు పెందుర్తిలోని పీలా నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



పీలా గోవింద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, తదితరులు



వినతులను స్వీకరిస్తున్న జడ్సీ హేమవతి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. జోనల్‌కమిషనరు హేమవతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. టీచర్స్‌లేఅవుట్‌లో యూజీడీ కనెక్షన్, రోడ్లు, కాలువలు నిర్మించాలని.. పాపయ్యరాజుపాలెంలో అక్రమ నిర్మాణం తొలగించాలని.. 93వ వార్డు గౌతంనగర్‌లో రోడ్డు ఆక్రమించి గోడకట్టడంపై చర్యలు తీసుకోవాలని, 95వ వార్డు శేషాద్రినగర్‌లో పిచ్చి మొక్కలు తొలగించాలని, 93వ వార్డు శ్రీనివాసనగర్‌లో కాలువపై పెట్టిన షెడ్‌ను తొలగించాలని వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించిన జడ్సీ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చురుగ్గా ఆలయ నిర్మాణం

పరవాడ, న్యూస్‌టుడే: మేజరుపంచాయతీ పరవాడ సంతబయలు వద్ద ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడ గతంలో ఉన్న పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానే కొద్దినెలల క్రితం నూతన ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సంబంధిత పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. అన్ని హంగులతో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామని సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు తెలిపారు.



నిర్మాణంలో ఆంజనేయస్వామి ఆలయం

ఉత్సాహంగా క్రీడా పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్‌స్కూల్ మైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్, వుషు పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్, అనకాపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ ఎం.వి.నాగేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. సుమారు 100 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎస్.రామ్మోహన్, రమ్య, రాజు, నాయుడు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన రైఫిల్ షూటింగ్ క్రీడాకారులతో నిర్వాహకులు



వుషు పోటీలకు హాజరైన విద్యార్థులు

తల్లీబిడ్డల సంరక్షణకు కృషి

పెందుర్తి, న్యూస్‌టుడే: తల్లీబిడ్డల సమీకృత అభివృద్ధి, పోషణ్ సక్షం అంగన్‌వాడీల ద్వారా మరింత మెరుగవుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని పులగవానిపాలెంలో సక్షం పథకంలో భాగంగా ఉన్నతీకరించి అంగన్‌వాడీ కేంద్రాన్ని కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సక్షం పథకంలో భాగంగా పెందుర్తి ప్రాజెక్టు పరిధిలో ఎంపికైన 19 అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం తల్లీబిడ్డల సంరక్షణకు ఎంతగానో కృషి చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాన్ని.. అనంతరం పోషణ్ వాటిక, ఆర్‌వో నీటి సదుపాయం, వాననీటి సంరక్షణ పిట్‌లను రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. పెందుర్తి ఐసీడీఎస్ సీడీపీవో నీలవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు శానాపతి శంకర్రావు, అయితు సింహాచలం, అవగడ్డ అప్పలనాయుడు, శానాపతి సోమశేఖర్, పెందుర్తి ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, ఎంఈవో మధుమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీవీ గీతాలక్ష్మి, డి.మానస, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



పులగవానిపాలెంలో సక్షం అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

సంకల్ప కాపు సంక్షేమ సంఘం ఏర్పాటు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో నూతనంగా 'సంకల్ప కాపు సంక్షేమ సంఘం' ఏర్పడింది. దీనికి అధ్యక్షులుగా గవర అప్పారావు, ఉపాధ్యక్షులుగా బలిరెడ్డి సత్యనారాయణ, కార్యదర్శిగా కుంచా గౌరీ మహాలక్ష్మీప్రసాద్, సహాయ కార్యదర్శిగా కంచిపాటి రాంబాబు, కోశాధికారిగా రేసుపూడి రమణ, సభ్యులుగా ఆకుల గణేష్, జెట్టి నాగ వరప్రసాద్, గల్లా సూరిబాబు, పడాల వెంకటరమణ, జెట్టి లీలా వరప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారంతా పెందుర్తి సుజాతనగర్ జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతాలు

పరవాడ, న్యూస్‌టుడే: తల్లీబిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పరవాడ ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి అన్నారు. పోషకాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ 2, 3 కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం ద్వారా రక్తహీనత దూరమవుతుందన్నారు. అనంతరం కేంద్రాల్లోని ఎల్‌ఈడీ టీవీ, వాటర్ ఫిల్టర్, పోషణవాటిక ప్రారంభించారు. అనంతరం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. గర్భిణులకు సాముహిక సీమంతాలు చేశారు. సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చుక్క రామునాయుడు, అంగన్‌వాడీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పరవాడలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, నాయకులు

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి సోమవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవింద రాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. తులసీ దళాలతో సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు ఉద్ధృతం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ యత్నాలు నిలిపివేయాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, గనులు కేటాయించాలన్న డిమాండ్లతో మూడు రోజులపాటు ధర్నాలు, నిరసనలతో కేంద్రంపై ఒత్తిడి పెంచనున్నట్లు పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు 1327వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 1న విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టనున్నారు. 2న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్షా శిబిరం వద్ద ధర్నా, 3న రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ దీక్షల్లో ఎల్ఎంఎంఎం, డబ్ల్యూఆర్ఎం, ఎస్‌బీఎం, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, కె.రాజబాబు, సీతారామరాజు, ఆర్.ధనరాజు, రాజేశ్వరరావు, క్రరి బాబూరావు, దాసరి శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ

దుర్గాదేవి ఉత్సవాలకు ముస్తాబు

పరవాడ, న్యూస్‌టుడే: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో పరవాడ మండలంలో వివిధ చోట్ల మండపాలు ముస్తాబవుతున్నాయి. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి యువజన సంఘాలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని పరవాడ, తానాం, వెన్నెలపాలెం, దేశపాత్రునిపాలెం, ధర్మారాయుడుపేట, లంకెలపాలెం, మంత్రిపాలెం, పెదముషిడివాడ, కలపాక, గొర్లెవానిపాలెం సర్దార్ గౌతులచ్చన్న నగర్ కూడలి, పి.భోనంగి తదితర ప్రాంతాల్లో మండపాలు రూపుదిద్దుకున్నాయి. అక్టోబరు 12 వరకు రోజూ ప్రత్యేక కుంకుమ పూజలతో పాటు అభిషేకాలు, అన్నసమారాధనలు, లక్షదీపార్చన తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కళాకారులకు నిలయమైన గొర్లెవానిపాలెంలో 2 నుంచి 8 అడుగుల ఎత్తు ఉన్న వందలాది విగ్రహాలను కళాకారులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జిల్లా నలుమూలల నుంచి ఇక్కడకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.



గొర్లెవానిపాలెంలో రూపుదిద్దుకున్న అమ్మవారి విగ్రహాలు

ఉక్కు కార్మికుల ఆకాంక్షను కాపాడతాం

ఉక్కునగరం(స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కార్మికుల ఆకాంక్షలు కాపాడేందుకు కృషి చేస్తున్నామని, ఒప్పంద కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తున్నట్లు విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో పోరాట కమిటీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉక్కులో నెలకొన్న అనిశ్చితి, ఆర్థిక విధ్వంసం, ఉద్యోగుల కార్మికుల ఆందోళన, నష్టాల వైపు నెట్టే పరిస్థితిని నాయకులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఏడో తేదీ లోపు నూతన ఇంఛార్జి సీఎండీని కలసి అన్ని అంశాలపై చర్చలు జరుపుతానన్నారు. కార్మికులు చేస్తున్న ఆందోళనను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల తొలగింపు, ఆర్థిక ఆంక్షలు ఈ సమయంలో అమలు చేయడం సరైన విధానం కాదన్నారు. ఈ మధ్య జరిగిన ఒప్పంద కార్మికుల తొలగింపుకు చేసిన కుట్ర కోణం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి దృష్టిలో లేదని ఈ విషయమై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, విళ్ళారామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, డి.అప్పారావు, మసేనురావు, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.


క్రీడలతో మానసిక ఉల్లాసం

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందుతారని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం పెందుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగాయి. క్రీడలను ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలుర, బాలికలకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశాఖ జిల్లా ఉప విద్యాశాఖాధికారి రవీంద్రబాబు, పీడీ కార్యవర్గం కన్వీనర్ లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, తదితరులు

అంచు దాటితే గండమే



సబ్బవరం మండలం అసకపల్లి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో కోతకు గురైన రోడ్డు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అసకపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు అసకపల్లి-దిబ్బపాలెం రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రహదారి అంచు దాటితే గండం తప్పదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ వాహనాలు అదుపు తప్పి పలువురు గాయాలపాలయ్యారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కోతకు గురైన చోట మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధి పులగవానిపాలెం రోడ్డులోని మొండిబంద వద్ద ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో రెండు గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో అటువైపు వెళ్తే ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు కుంగిపోవడంతో భారీ గుంత ఏర్పడింది. ఆ పక్కనే మరో గొయ్యి ఉండడంతో కార్లు, ఇతర పెద్ద వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి గోతులు పూడ్చి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పులగవానిపాలెం రోడ్డులోని మొండిబంద వద్ద ప్రమాదకరంగా గోతులు

గ్రామ సింహాల స్వైరవిహారం



పరవాడలో రహదారిపై శునకాలు

పరవాడ, న్యూస్‌టుడే: మేజరుపంచాయతీ పరవాడలో వీధికుక్కల బెడద ఎక్కువైంది. గ్రామంలోని వందలాది శునకాలు సంచరిస్తుండటంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. రోజురోజుకీ సమస్య పెరుగుతున్నా వాటి నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని.. ఏదో ఒకరోజు తూతూ మంత్రంగా కుక్కలను పట్టించి చేతులు దులిపేసుకుంటున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ద్విచక్రవాహనదారులను వెంబడించడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. పొలాల్లో గుంపులుగా సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏటీఎం సెంటర్లు, దుకాణాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో తిష్ఠ వేస్తున్నాయని చెబుతున్నారు. రాత్రి వేళ పెద్దగా అరవడంతో కంటినిండా నిద్ర కరవైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.